
ఆరుగొలనులో కూల్చేస్తున్న మాదాల శ్రీనివాసరావుకు చెందిన ఎరువుల దుకాణం (ఫైల్)


రేమల్లె సర్వే నంబరు 22-8,9లో నిర్వహిస్తున్న అక్రమ క్వారీయింగ్ (ఫైల్)

భూబాగోతాలు

తవ్వే కొద్దీ వెలుగులోకి వంశీ అనుచరుల కబ్జాలు!

ప్రభుత్వ భూమి కనిపిస్తే కనుమరుగే..

- వైసీపీలో చేరలేదని టీడీపీ నేతల ఆస్తుల ధ్వంసం
- అధికారుల అండతో యథేచ్ఛగా ఆక్రమణలు
- రైతులను బెదిరించి లాక్కొన్న భూముల్లో అక్రమ మైనింగ్
- గన్నవరం, బాపులపాడు మండలాల్లో అనేక అరాచకాలు


జాస్తి వెంకటేశ్వరరావుకు చెందిన భూమిలో పత్రాలు చూస్తున్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ (ఫైల్)

గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు రెచ్చిపోయారు. ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో అరాచకం సృష్టించారు. ప్రభుత్వ భూమి కనిపిస్తే గద్దల్లా వాలిపోయారు. చిన్న, సన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న భూములను సైతం వదల్లేదు. ఆయా భూముల్లో అక్రమ మైనింగ్ నిర్వహించి కోట్లు కొల్లగొట్టారు. కొన్ని చోట్ల ఆ భూములకు పట్టాలు పుట్టించి జగనన్న కాలనీల కోసం ప్రభుత్వానికి అమ్మేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూముల వివాదాల్లోనూ తలదూర్చి ఆ ఆస్తులను తమ పరం చేసుకున్నారు. వైసీపీలో చేరలేదనే అక్కసుతో టీడీపీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేశారు. వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలను ఆక్రమించుకున్నారు. అధికారులను అడ్డంపెట్టుకుని ఎన్నో అడ్డదారులు తొక్కారు. గన్నవరం, బాపులపాడు మండలాల్లో ఐదేళ్ల పాటు సాగిన అరాచకాల్లో కొన్ని ఇలా..

-గన్నవరం/హనుమాన్ జంక్షన్‌రూరల్, ఆంధ్రజ్యోతి

■ అంపాపురంలో సర్వే నంబరు 109-3లో 14 ఎకరాలను పేద రైతులు సాగు చేసుకుంటుంటే ఇది ప్రభుత్వ భూమి, సాగు చేయకూడదని రెవెన్యూ శాఖతో చెప్పించి రైతులను ఖాళీ చేయించారు. ఆ తర్వాత బినామీల పేర్లతో ఆ భూములకు పట్టాలను పుట్టించి జగనన్న కాలనీ పేరుతో పట్టా భూమితో సహా అమ్మేందుకు ప్రయత్నిస్తే కొందరు నిబద్ధత గల అధికారులు అడ్డుపడటంతో అది ఆగిపోయింది. డొంకతో సహా కలిపి ఎకరా రూ.50 లక్షలకు అమ్మేందుకు సిద్ధమవ్వగా.. ప్రభుత్వం మారిపోవడంతో మరుగునపడిపోయింది.

■ రేమల్లెలో చిన్నసన్నకారు రైతులు సాగు చేసుకుంటున్న సర్వే నంబరు 422-8,9లో 20 ఎకరాల అసైన్డ్ భూములను ఆక్రమించుకోవడంతో పాటు 20 అడుగులకుపైగా అక్రమ మైనింగ్ నిర్వహించారు. అదే గ్రామంలో హైదరాబాద్‌కు చెందిన వ్యక్తి పోలవరం గట్టున ఉన్న మూడు ఎకరాల భూమిలో లేఅవుట్‌కు సిద్ధం చేస్తున్న విషయం తెలుసుకుని స్థానిక నాయకులతో కలిసి 26 సెంట్ల భూమిని మండల స్థాయి వైసీపీ నాయకుని పేరుతో రిజిస్ట్రేషన్ చేయించారు. తదనంతరం అనుంగు సహచరులు తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. వీరి ఆరాచకాలను భరించలేక ఆ వ్యక్తి తిరిగి హైదరాబాద్ వెళ్లిపోవడం గమనార్హం.

■ మల్లవల్లి పారిశ్రామికవాడలో చదును చేస్తున్నామనే పేరుతో కన్‌స్ట్రక్షన్ వారిని అడ్డుపెట్టుకుని 100 ఎకరాలకుపైగా భూమిలో అక్రమంగా తవ్వకాలు జరపడంతో పాటు కోట్లాది రూపాయల గ్రావెల్‌ను పోర్టు అభివృద్ధి పనుల పేరుతో తరలించేశారు. మట్టి మాఫియా అయితే వేలేరు, కొత్తపల్లి, రంగన్నగూడెం, తదితర గ్రామాల్లో చెరువులను చెరపట్టి దోచుకోవడమే పనిగా అక్రమ తవ్వకాలు నిర్వహించింది.


మల్లవల్లి సర్వే నంబర్ 11లో అక్రమ తవ్వకాలు (ఫైల్)

■ బాపులపాడు మండలంలోనే సుమారు 200 ఎకరాల వరకూ అక్రమ తవ్వకాలతో గోతులు పడి ఉన్నాయి. కోట్లాది రూపాయలు మాత్రం మాజీ ఎమ్మెల్యే అనుచరుల జేబుల్లోకి వెళ్లాయి. బాపులపాడు మండలానికి తహసీల్దార్‌గా రావడానికే అధికారులు భయపడ్డారంటే పరిస్థితి అర్థమవుతోంది. ఇదే అదనుగా గన్నవరం తహసీల్దార్‌గా పనిచేసిన నరసింహారావు (బాపులపాడు మండలంలో కూడా పని చేశారు) ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ పనులను చక్కబెట్టారు.

టీడీపీ నేతల ఆస్తుల ధ్వంసం

తన గెలుపునకు కృషి చేసిన టీడీపీ నాయకులను తనతో పాటే వైసీపీలో చేరాలని వంశీ ఆదేశాలు జారీ చేశాడు. బాపులపాడు మండలంలోని నాయకులు అడ్డం తిరగడంతో వారి ఆస్తులను ధ్వంసం చేసేందుకు స్థానిక నాయకులు, అధికారులతో కలిసి భయోత్పాతం సృష్టించారు.

■ తిప్పనగుంటకు చెందిన పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మాదాల శ్రీనివాసరావు ఎరువుల దుకాణాన్ని అర్ధరాత్రి రెవెన్యూ అధికారుల సహకారంతో నేలమట్టం మిగతా 6లో..

దుర్గగుడిలో హ్యాకింగ్

అన్ని విభాగాల ఫైల్స్ హ్యాక్ చేస్తున్న ఓ ఉద్యోగి

ఆలయ కీలక సమాచారం మొత్తం సేకరణ

- ఈ-ఫైల్స్, ఈ- నోటిఫికేషన్స్ సైతం తన సిస్టమ్‌కు బదలాయింపు
- కాంట్రాక్టర్లతో బేరసారాలు... దాతల నుంచి విరాళాల సేకరణ
- వరుస సస్పెన్షన్లు.. అయినా మళ్లీ విధుల్లోకి..
- హ్యాకింగ్‌లో మెళకువల కోసం సింగపూర్, మలేషియా పర్యటనలు!

నిఘా పెంచిన అధికారులు.. ఆధారాల కోసం అన్వేషణ



ఆంధ్రజ్యోతి -ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర దేవస్థానంలో కీలక విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి దెబ్బకు అధికారులు హడలిపోతున్నారు. దేవస్థానానికి సంబంధించిన అన్ని విభాగాల ఆన్‌లైన్ ఫైల్స్ సదరు ఉద్యోగి తన సిస్టమ్‌కు అనుసంధానం చేసుకున్నాడు. ఏఈవో, సూపరింటెండెంట్ నుంచి ఈవోకు వెళ్లాల్సిన కీలకమైన ఫైల్స్‌ను సైతం హ్యాక్ చేస్తున్నాడు. దేవస్థానానికి విరాళాలు ఇచ్చే దాతలు, ఇతర ముఖ్యుల ఫోన్ నంబర్లు, వివరాలు తన సిస్టమ్‌లోనే పెట్టుకుని వారితో ఆలయ ప్రతినిధిగా మాట్లాడుతూ నగదు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విరాళాల సొమ్ము కూడా ఈవోకు తెలియకుండా తన బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నట్లు తెలిసింది. వెబ్‌సైట్లను హ్యాక్ చేయటం అతనికి వెన్నతో పెట్టిన విద్య. హ్యాకింగ్ చేయడంలో మరిన్ని మెలకువలు నేర్చుకునేందుకు తరచూ సింగపూర్, మలేషియా వెళ్లి వస్తున్నట్లు సమాచారం. విదేశీ హ్యాకర్లు సైతం ఇతని వద్దకు వచ్చివెళ్తుంటారని వినికిడి. గతంలో టెండర్ల సమాచారం హ్యాక్ చేసి కాంట్రాక్టర్లతో పెద్ద ఎత్తున బేరసారాలు నడిపినట్లు తెలిసింది.

సస్పెండ్ చేసినా మారని తీరు

ఇటీవల ఆలయ ఈవో డిజిటల్ సిగ్నేచర్‌ను హ్యాక్ చేసి పలు అవకతవకలకు పాల్పడ్డాడు. గుర్తించిన ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ సదరు ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆ తర్వాత సదరు ఉద్యోగి తన పలుకుబడితో మళ్లీ విధుల్లో చేరాడు. ఈ సారి ఏకంగా ఈ- ఫైల్స్, ఈ- నోటిఫికేషన్స్‌ను హ్యాక్ చేసి డేటా చౌర్యానికి పాల్పడుతున్నట్లు సమాచారం. దీంతో అతనిపై అధికారులు నిఘా పెంచారు. ఎవరెవరితో హ్యాకింగ్ కింగ్ లావాదేవీలు నడిపాడన్న దానిపై కూడా అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. గతంలో కూడా ఈ హ్యాకింగ్ కింగ్‌పై పలు ఆరోపణలు వచ్చాయి. సస్పెన్షన్‌కు గురవ్వటం, అరెస్ట్ కావటం వంటి ఘటనలు కూడా జరిగాయి. తిరిగి ఏదోవిధంగా మేనేజ్ చేసుకుని ఉద్యోగం పొందటం సదరు ఉద్యోగికి పరిపాటిగా మారింది.

ఒకరి సొమ్ము మరొకరికి జమ

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్వాకం

గ్యాంగ్ మజ్దూర్ వీరాస్వామి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఏఎన్‌ఎం జ్యోతిరాణి ఖాతాలోకి..

- అకౌంటెంట్ జనరల్ కార్యాలయం పరిశీలనలో వెలుగులోకి..
- జ్యోతిరాణి నుంచి డబ్బులు వసూలు చేసేపనిలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు
- చలానా ద్వారా తమకు చెల్లించాలని ట్రెజరీ అధికారుల మెలిక
- ఈ వ్యవహారంలో తనను ఇరికిస్తున్నారని కలెక్టర్‌కు దివ్యాంగ ఉద్యోగి ఫిర్యాదు


BENEFICIARY DETAILS

Beneficiary List(1) Gross Amount: ₹ [illegible] Deduction: ₹ 0.00 Net Amount: ₹ [illegible]

Code	Name	Bank A/c No	Gross Amount	Deduction	Net Amount	Payment status	Payment Ref.	Payment Date
[illegible]	BODDU JYOTHI RANI	[illegible]	[illegible]	0.00	[illegible]	Success	[illegible]	[illegible]

బొడ్డు జ్యోతిరాణి పేరుతో చేసిన బెనిఫిట్స్ చెల్లింపులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్)శాఖ ఉద్యోగి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను మరో శాఖ ఉద్యోగి ఖాతాలో జమ చేసిన విషయం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. వివరాల్లోకి వెళితే... విజయవాడ డివిజన్ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం పరిధిలో పనిచేస్తున్న గ్యాంగ్ మజ్దూర్ వీరాస్వామి ఇటీవలే పదవీ విరమణ చేశారు. ఈయనకు ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ రూ.8,91,420 రావాల్సి ఉంది. అయితే ఈ నగదును ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు బొడ్డు జ్యోతి రాణి అనే మహిళ ఖాతాకు బదిలీ చేశారు. పెండ్యాల గ్రామానికి చెందిన జ్యోతిరాణి ఏఎన్‌ఎంగా పనిచేస్తూ నాలుగు నెలల కిందట పదవీ విరమణ చేశారు. జ్యోతి రాణి తన ఖాతాలో పడిన నగదులో కొంత మొత్తం డ్రా చేసినట్టుగా తెలిసింది. తనకు రావాల్సిన నగదు వేరే ఖాతాకు బదిలీ జరిగినట్టుగా వీరాస్వామికి తెలియదు. అరియర్స్ చెల్లింపులో ఇంకా ప్రాసెస్ జరుగుతుందని ఆయన భావిస్తున్నాడు. ఈ క్రమంలో ఒక రోజు ఏపీ ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నుంచి అరియర్స్ చెల్లింపులపై వీరాస్వామికి లేఖ అందింది. తన బ్యాంకు ఖాతాలో బెనిఫిట్స్ జమ కాని విషయాన్ని వీరాస్వామి అకౌంటెంట్ జనరల్ కార్యాలయం దృష్టికి తీసుకెళ్లారు. అకౌంటెంట్ జనరల్ కార్యాలయం అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను దీనిపై వివరణ కోరగా అసలు విషయం వెలుగు చూసింది. విజయవాడ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ) దీనిపై పరిశీలన జరపగా, వీరాస్వామికి చెల్లించాల్సిన నగదు బొడ్డు జ్యోతి రాణికి చెల్లించినట్టుగా గుర్తించారు. దీనిపై అంతర్గత విచారణ ప్రారంభించగా.. మరో వైపు అకౌంటెంట్ జనరల్ కార్యాలయ అధికారులు కూడా రంగంలోకి దిగటంతో వివాదంగా మారింది. విజయవాడ ఈఈ కార్యాలయంలోని సూపరింటెండెంట్ మిగతా 6లో..

గతంలోనూ ఇలాంటి ఘటనలు

ఇంతకు ముందు కూడా ఆర్‌డబ్ల్యూఎస్ విజయవాడ డివిజన్ ఈఈ కార్యాలయం పరిధిలో ఇలాంటి ఉదంతాలు చోటు చేసుకున్నాయి. గతంలో జేటీవోగా పనిచేసిన నర్రా సురేష్ బాబుకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.8 లక్షలు చెల్లించారు. ఆ తర్వాత మళ్లీ రెండో సారి కూడా చెల్లింపులు చేశారు. ఈ వ్యవహారం వెనుక వాటాల పంపకాల ఒప్పందం జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో కూడా ఈ విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకు వచ్చింది. దీనిపై అప్పటి సూపరింటెండెంట్ ఇంజనీర్ రమణ ఆగ్రహం వ్యక్తం చేసి విచారణకు కూడా ఆదేశించారు. జరిగిన తప్పును సరిదిద్దుకోవటానికి అప్పటి ఇంజనీరింగ్ అధికారులు నానా తిప్పలు పడ్డారు.

ఏజే విద్యా పరిషత్‌కు పునర్వైభవం!

చారిత్రక నేపథ్యం కలిగిన ఆంధ్ర జాతీయ కళాశాల(ఏజే విద్యాపరిషత్)కు పునర్వైభవం రానుంది. మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు డిగ్రీ కోర్సులు మళ్లీ అందుబాటులోకి రాబోతున్నాయి. గతేడాది అక్టోబరు 2వ తేదీన మహాత్మాగాంధీ జయంతి, స్వచ్ఛతాహీసేవ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మచిలీపట్నం వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు బహిరంగ సభలో, ఏజే కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ కళాశాలను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకుని నడుపుతుందని ప్రకటించారు. ఈ నేపథ్యంలో పట్టణ ప్రముఖులు ఈ కళాశాలకు పూర్వ వైభవం తెచ్చేందుకు తమవంతుగా ప్రయత్నాలు చేస్తున్నారు. *- ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం*

గత వైసీపీ ప్రభుత్వంలో మూతపడిన కళాశాల

ఇక ప్రభుత్వమే నడుపుతుందని సీఎం చంద్రబాబు హామీ

- మంత్రి కొల్లు రవీంద్ర నేతృత్వంలో దేవదాయశాఖ మంత్రి, కమిషనర్‌కు పట్టణ ప్రముఖుల వినతి
- మచిలీపట్నంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక విద్యార్థుల ఇక్కట్లు
- కళాశాల ఆస్తులపై వచ్చే ఆదాయం ప్రైవేటు వ్యక్తి చేతుల్లోకి..



ఆంధ్ర జాతీయ విద్యాపరిషత్

ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేక ఇబ్బందులు

జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో గతంలో నోబుల్ కళాశాల, హిందూ కళాశాల, ఆంధ్ర జాతీయ కళాశాలలు ఎయిడెడ్ కళాశాలలుగా వందేళ్లకుపైగా సేవలు అందించాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఎయిడెడ్ విద్యాసంస్థలపై కొరడా ఝుళిపించడంతో ఈ మూడు కళాశాలలు మనుగడ కోల్పోయి ప్రైవేటుపరం అయ్యాయి. దీంతో డిగ్రీ కోర్సులు చదవాలంటే అధిక మొత్తంలో ఫీజులు చెల్లించాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆంధ్ర జాతీయ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని డిగ్రీ కోర్సులను మళ్లీ ఇక్కడ ప్రవేశపెడితే మచిలీపట్నం పరిసర ప్రాంతాలలోని పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది.

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో నాడు ఏర్పాటు

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో 1910లో ఆంధ్ర జాతీయ కళాశాలను ఆ నాటి ప్రముఖులు కోపల్లె హనుమంతరావు, ముట్నూరి కృష్ణారావు, డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య తదితరులు స్థాపించారు. కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో 380 ఎకరాలకు పైగా భూములను ఈ కళాశాలను నడిపేందుకు అప్పట్లో దాతలు సమకూర్చారు. ఈ భూముల ద్వారా వచ్చే ఆదాయంతోనే కళాశాలను అప్పట్లో నడిపారు. 1987లో ఈ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని దేవదాయశాఖ ద్వారా నడిపేందుకు అనుమతులు ఇచ్చింది. జాతీయ పతాక రూపశిల్పి పింగళి వెంకయ్య ఈ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేశారు. మహాత్మాగాంధీ 1910, 1921 సంవత్సరాల్లో ఈ కళాశాలను రెండు దఫాలుగా సందర్శించారు. ఇక్కడే బసచేసి స్వాతంత్ర్య ఉద్యమానికి ఊపిరిపోశారు. దీంతో ఈ కళాశాల మరింతగా ప్రాచుర్యం పొందింది. 2010లో శతవసంతాలను ఈ కళాశాల పూర్తి చేసుకుంది. ఈ కళాశాలలో ఐటీఐ, ఓరియంటల్ సంస్కృత ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీఈడీ కళాశాలలు ఉన్నాయి. వీటన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చి ఆంధ్ర జాతీయ విద్యాపరిషత్‌గా ఏర్పాటు చేసి ఈ విద్యాసంస్థను నడుపుతూ వచ్చారు. ఈ కళాశాల ఎయిడెడ్ కళాశాలగా కొనసాగడంతో అధ్యాపకులు పదవీ విరమణ చేస్తే మళ్లీ ఆ పోస్టులను భర్తీ చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో ఈ కళాశాలతోపాటు బీఈడీ కళాశాల కూడా మూతపడి తన ఉనికిని కోల్పోయింది. ఇక్కడ బీఈడీ కళాశాలకు ఉమ్మడి రాష్ట్రంలోనే మంచి మిగతా 6లో..

ఏడీసీఎల్‌కు వీఐపీ కారిడార్ బ్యూటిఫికేషన్ బాధ్యతలు

- ఎయిర్‌పోర్టు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు 13 కిలోమీటర్లు
- అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ నుంచి ఏడీసీఎల్‌కు నిర్వహణ బాధ్యతలు
- రాజధాని పనులు ఊపందుకోనున్న నేపథ్యంలో కీలక బాధ్యతలు

8లో

గనుల్లో రాష్ట్రానికి రావాల్సిన వాటా ఇచ్చేస్తాం

- కేంద్ర గనుల శాఖ మంత్రి సతీష్ చంద్రదుబే 8లో

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ బాలాజీ 8లో

ఐదుగురు విద్యార్థినుల అదృశ్యం

గంటల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగింత 6లో

అంగన్వాడీ కేంద్రంలో ఫుడ్ పాయిజన్

13 మంది చిన్నారులకు వాంతులు, విరేచనాలు


మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

- పప్పు, కోడిగుడ్లు తినడంతో..
- ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు పెద్ద తండాలో ఘటన
- మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలింపు.. నిలకడగా ఆరోగ్యం

ఎ.కొండూరు/మైలవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రం (168)లో పప్పు, కోడి గుడ్డు తిన్న 13 మంది చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురైన ఘటన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం పెద్ద తండాలో గురువారం సంచలనం రేపింది. వివరాల్లోకి వెళితే.. రోజు వలే అంగన్వాడీ కేంద్రంలో మధ్యాహ్నం భోజనం కింద చిన్నారులకు పప్పు, కోడి గుడ్డు పెట్టారు. కొద్ది సేపటి తర్వాత భూక్యా మోక్షిత(4), గుగులోతు సాయి దేవాన్ష్(5), జరబల జస్వంత్ దత్త(5), పవన్(4), అజ్మీర లవణ్యశ్రీ(3), గుగులోతు మధురియా(4), జరబల శాన్వీ(4), అజ్మీర తేజస్(4), రిషిత్(4), ఉదయశ్రీ(5) వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు 108కు సమాచారం ఇచ్చిన గంటకు కూడా అది రాకపోవడంతో టీడీపీ గిరిజన మిగతా 6లో..



వీరమ్మ ఆలయంవద్ద భక్తుల తాకిడి, వీరమ్మతల్లిని దర్శించుకున్న వైవీబీ రాజేంద్రప్రసాద్ (కింద)

వీరమ్మ తిరనాళ్లకు పోటెత్తిన భక్తులు



ఉయ్యూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తున్నారు. శనివారంతో తిరునాళ్ల ముగియనున్న నేపథ్యంలో గురువారం వేకువ జామునుంచి భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పాలపొంగళ్లు తయారుచేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించేందుకు దుకాణాల వద్ద రద్దీ కన్పించింది.

వీరమ్మ తిరునాళ్లలో గురువారం అమ్మవారిని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ దర్శించి పూజలు చేశారు. ఆయనకు ఆలయ కమిటీ స్వాగతం పలికి అమ్మవారి వస్త్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 15 రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే తిరునాళ్లకు తెలుగు రాష్ట్రాలతో పాటు పలుప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకుంటారన్నారు. కొలిచిన వారి కొంగు బంగారమై కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి వీరమ్మ దర్శనం మహాభాగ్యంగా భావిస్తారన్నారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నట్టు తెలిపారు. బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణి, జంపన వీర శ్రీనివాస్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.



కోసూరువారిపాలెం వద్ద టమాట రైతులతో మార్కెటింగ్ అధికారులు

దళారులతో మోసపోవద్దు

- రైతు బజార్‌లో నేరుగా అమ్ముకోండి
- టమాట పంటను పరిశీలించిన మార్కెటింగ్ అధికారులు

మోపిదేవి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో కూరగాయల పంటలు సాగు చేస్తున్న రైతులు దళారులను నమ్ముకుండా స్వయంగా రైతు బజారుకు విచ్చేసి గిట్టుబాటు ధరకు విక్రయాలు జరుపుకోవాల్సిందిగా మార్కెటింగ్‌శాఖ ఏడీ నిత్యానంద్ తెలిపారు. గురువారం మోపిదేవి మండలంలోని కోసూరువారిపాలెం, మేళ్లమర్తిలంక గ్రామాల్లోని టమాట తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. మండలంలోని లంక గ్రామాలు కూరగాయలు, వాణిజ్య పంటల సాగుకు దివిసీమ ప్రాంతం విశిష్టత కలిగిందన్నారు. ప్రస్తుతం టమాట దిగుబడి అధికంగా ఉన్నప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర రావటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దళారులను నమ్ముకుని నష్టాల పాలవుతున్నట్టు అధికారులకు రైతులు వివరించారు. మండలంలో 117 ఎకరాల్లో టమాట సాగు చేస్తుండగా, 50 శాతం వరకు ఇప్పటికే పంట కోత కోయటం జరిగిందని తెలిపారు. మార్చి నెల వరకు పంట సాగు ఉంటుందని, మచిలీపట్నం రైతుబజార్‌కు పంటను రైతులు స్వయంగా తీసుకెళ్లి అమ్ముకోవచ్చునని, కేజీకి రూ.13లకు రైతులకు ధర ఉంటుందని ఏడీ తెలిపారు. అవసరమైన పక్షంలో ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ రైతు బజారులో కూడా టమాట విక్రయించుకునేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడతామని తెలిపారు. రైతులు ఎక్కువగా ఉంటే 20 స్టాళ్ల వరకు కేటాయిస్తామని తెలిపారు. గిట్టుబాటు ధర రావటం లేదని రైతులు ఏమాత్రం ఆందోళన చెందాల్సిన పనిలేదని, నేరుగా అమ్ముకుని గిట్టుబాటు ధర తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అవనిగడ్డ ఉద్యానశాఖాధికారి ఎస్.రమేష్, మచిలీపట్నం రైతు అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.



గో గ్రీస్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

గో గ్రీస్ క్యాలెండర్ ఆవిష్కరణ

కృష్ణలంక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల రాష్ట్ర సమాఖ్య గో-గ్రీస్ క్యాలెండర్, ఇంజినీరింగ్ డైరీని జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడు గురువారం ఎంజీ రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్లకు మంత్రి అభినందనలు తెలిపారు. సాగునీటి వినియోగదారుల సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు, జలవనరులరంగ నిపుణులు, ఇంజినీరు, నాగార్జునసాగర్ ఎడమ కాలువ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు సమాజంలో పర్యావరణ ప్రాముఖ్యతను తెలియజేస్తూ ప్రస్తుత కుంభమేళా సమయంలో ఈనెలలో రాబోయే మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేకంగా గో-గ్రీస్ క్యాలెండర్, డైరీని రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు కృషిని అభినందించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని సాగునీటి సంఘాల ప్రతినిధులు జలవనరుల రంగ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు కొమ్మారెడ్డి రాజేష్, యార్లగడ్డ రవిబాబు (కృష్ణా), పామర్తి శ్రీనివాసరావు, కఠారి కోటేశ్వరరావు (ఎన్టీఆర్), బొపూడి కాశీబాబు, రావర్ల బాలకృష్ణ (ఏలూరు జిల్లా), నల్లజర్ల రవికుమార్, ఆరే పున్నారెడ్డి (గుంటూరు జిల్లా) తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కారుణ్యంపై కార్మిక సంఘాల హర్షం

బస్‌స్టేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో కారుణ్య నియామకాలకు ప్రభుత్వం ఆమోదం తెలపటంపై ప్రజారవాణా సంస్థ ఎంప్లాయీస్ యూనియన్, కార్మిక పరిషత్‌లు హర్షం వెలిబుచ్చాయి. గురువారం వేర్వేరు ప్రకటనల్లో ఉద్యోగ సంఘాలు స్పందించాయి. కార్మిక పరిషత్ రాష్ట్ర కమిటీ ఈ సందర్భంగా కారుణ్య నియామకాలకు ఆదేశాలు జారీచేయటంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. కార్మిక పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావులు ఒక ప్రకటన విడుదల చేశారు. కారుణ్య నియామకాలు చేయాలని గత వైసీపీ ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదన్నారు. మంత్రులు లోకేష్, రాంప్రసాద్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు 600 కుటుంబాలలో అర్హత కలిగిన వారికి ఉద్యోగాలు వస్తాయని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.నరసయ్య ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు ఎండీ ద్వారకా తిరుమలరావు బుధవారం రాత్రి ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు.

అసూయతో అడ్డుకునే యత్నం!

- నందిగామ వందపడకల ఆసుపత్రి పనులకు బ్రేక్
- హైకోర్టులో రిట్ పిటిషన్
- వైద్యశాల ఇరుకు ప్రదేశంలో ఉన్నదని వాదన
- ఉన్న స్థానంలోనే నిర్మించి తీరుతాం : అభివృద్ధి కమిటీ



నందిగామ ఏరియా వైద్యశాల

నందిగామ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నందిగామ ఏరియా వైద్యశాలను వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధిపై హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలైంది. సేకరించిన సమాచారం ప్రకారం.. నందిగామ ప్రాంత ప్రజలు సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న వంద పడకల వైద్యశాల కలను కూటమి ప్రభుత్వం నెరవేర్చింది. ఈమేరకు ఇటీవల జీవో విడుదల చేసిన ప్రభుత్వం రూ.34 కోట్లు నిధులు మంజూరు చేసింది. జీప్లస్-4 భవన నిర్మాణంతో పాటు వైద్యశాలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం సిద్ధమైంది. ప్రస్తుతం ఉన్న వైద్యశాల స్థానంలోనే వంద పడకలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య నిర్ణయించారు. ఈమేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. సౌమ్య నిర్ణయంపై మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్‌లు విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం ఉన్న వైద్యశాల ఇరుకైన ప్రదేశంలో ఉందని, పార్కింగ్, అంబులెన్స్‌లు వచ్చేందుకు వీలుండదని వాదించారు. వంద పడకల ఆసుపత్రి కోసం గత ప్రభుత్వంలోనే చర్యలు చేపట్టామన్నారు. వైద్యశాల నిర్మాణానికి కోనాయపాలెం బైపాస్‌లో ఐదు ఎకరాలు సేకరించి సిద్ధంగా ఉంచామని, ఆ స్థలంలో వైద్యశాల నిర్మిస్తే సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. అయితే అధికారులు మాత్రం ఉన్న స్థానంలోనే నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ఈక్రమంలో పట్టణానికి చెందిన మాడుగుల ప్రభుదాసు అనేవ్యక్తి హైకోర్టును ఆశ్రయించాడు. వైద్యశాల విస్తరణ కోసం ప్రభుత్వం కేటాయించిన నిధులను పాత వైద్యశాలలో ఖర్చు చేయడం సరికాదని, దీనివల్ల రోగులు ఇబ్బంది పడతారని పేర్కొన్నారు. ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నందున ఆ నిర్ణయాన్ని వెనక్కు తీసుకొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ప్రభుత్వం నుంచి కూడా కౌంటర్ దాఖలైనట్టు తెలిసింది.

వైసీపీ హయాంలో సేకరించిన భూమిని వదిలేసిన అధికారులు..

వైసీపీ అధికారంలో ఉండగా, వంద పడకల వైద్యశాల కోసం కోనాయపాలెం బైపాస్ పక్కన ఐదు ఎకరాల భూమిని సేకరించారు. ఎకరం రూ.60 లక్షలుగా ధర నిర్ణయించారు. కానీ రైతులకు సొమ్ము చెల్లించకుండానే భూమి రికార్డులు బదలాయించారు. ఇంతలో ఎన్నికలు రావడం, కూటమి అధికారంలోకి రావడం జరిగింది. భూయజమానులు పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా సొమ్ము విడుదల కాలేదు. పాత వైద్యశాల స్థానంలోనే వంద పడకల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించడంతో రైతుల భూమి రైతులకు ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. దీంతో వైద్యశాల తరలింపు వాదనకు తెరపడింది. ప్రత్యామ్నాయం లేక పోవడంతో పాత వైద్యశాల స్థానంలోనే వంద పడకలు ఏర్పాటు చేయడం అనివార్యమైంది. ఈదశలో దాఖలైన పటిషన్‌పై న్యాయ స్థానం ఏం నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

ఈర్ష్యతోనే అడ్డుకుంటున్నారు..

వేపూరి నాగేశ్వరరావు, వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్



నందిగామ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య వంద పడకల వైద్యశాల సాధించారని వైద్యశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ వేపూరి నాగేశ్వరరావు అన్నారు. ఐదేళ్ల పాటు వైద్యశాలపై ప్రచారం చేసుకున్న మొండితోక సోదరులు కనీసం అనుమతులు కూడా తేలేక పోయారన్నారు. వైద్యశాల పరిసరాలు ఇరుకుగా ఉన్నాయన్న వాదన సరికాదన్నారు. రెండు వైపులా విశాలమైన రహదారులు ఉన్నాయన్నారు. కేవలం అసూయతోనే తన అనుచరుడితో కోర్టులో పిటిషన్ వేయించారని ఆరోపించారు. న్యాయమే గెలుస్తుందని, ఉన్న వైద్యశాల స్థానంలోనే వంద పడకలు నిర్మించి తీరుతామన్నారు.

తాడేపల్లిలో అక్రమ తవ్వకాలు!

- కాంట్రాక్టు సంస్థపై చర్యలకు మైనింగ్ అధికారికి రూరల్ తహసీల్దార్ లేఖ
- ప్రయివేటు వ్యక్తుల పాత్రపైనా పోలీసులకు ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పర్యావరణ అనుమతులు లేకుండా విజయవాడ వెస్ట్ బైపాస్ పనులు చేపడుతున్న మెయిల్ సంస్థ తాడేపల్లిలో అక్రమ తవ్వకాలు జరిపిందని, సంస్థతో పాటు పలువురు ప్రైవేటు వ్యక్తులు ఈ అక్రమ తవ్వకాలలో ఉన్నారంటూ విజయవాడ రూరల్ తహసీల్దార్ బి.సుగుణ జిల్లా మైనింగ్ అధికారికి లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన మెయిల్ సంస్థ, సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అలాగే అక్రమ తవ్వకాలపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మెయిల్‌ను అడ్డం పెట్టుకుని కొంతమంది ప్రైవేటు వ్యక్తులు అక్రమ క్వారీయింగ్‌కు పాల్పడిన విషయం వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. విజయవాడ రూరల్ మండలం తాడేపల్లి గ్రామంలోని రీ సర్వే నెంబర్ 247/3ఏ1, 2బీ1లలో 2.51 ఎకరాల భూమిని మైనింగ్ చేయటానికి విజయవాడ వెస్ట్ బైపాస్ రోడ్డు కాంట్రాక్టు సంస్థ మెయిల్ జిల్లా మైనింగ్ అధికారికి అర్జీలు దాఖలు చేసుకోవటం జరిగింది. ఈ అర్జీపై రెవెన్యూ శాఖను నివేదిక కోరటం జరిగింది. మెయిల్ ప్రతిపాదించిన భూమి అటవీభూమికి 500 మీటర్ల లోపు ఉండటంవల్ల జిల్లా అటవీశాఖ పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా రెవెన్యూ తహసీల్దార్ కోరటం జరిగింది. అటవీశాఖ అధికారులు కొన్ని షరతులకు లోబడి అనుమతికి సిఫార్సు చేయటంతో అనుమతులు ఇవ్వటానికి జిల్లా మైనింగ్ అధికారికి రెవెన్యూ అధికారులు నివేదించటం జరిగింది. ఇదిలా ఉండగా.. విజయవాడ రూరల్ తహసీల్దార్ బి.సుగుణ జిల్లా మైనింగ్ అధికారికి తాజాగా ఒక లేఖ రాశారు. ఈ లేఖ ప్రకారం.. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసిన సందర్భంలో మెయిల్ సంస్థకు అనుమతించిన సర్వే నెంబర్ 247/3ఏ1, 2బీ1లలో 2.51 ఎకరాల భూమితో పాటుగా సర్వే నెంబర్ 247/3బీలో 2.60 ఎకరాలు, సర్వే నెంబర్ 247/3ఏ2 లో 0.47 సెంట్లు, సర్వే నెంబర్ 247/3ఏ3లో 0.25 సెంట్లలోని భూమిలో అక్రమ తవ్వకాలు జరిగాయని తెలిపారు. అలాగే మెయిల్ సంస్థకు మౌఖికంగా అనుమతించినా సర్వే నెంబర్ 247/3ఏ1 లో 1.51 సెంట్ల భూమికి పూర్తి స్థాయిలో ఇప్పటి వరకు అనుమతులు రాకుండానే తవ్వకాలు జరిగాయని లేఖలో పేర్కొన్నారు. అలాగే కొత్తపేట పోలీసులకు చేసిన ఫిర్యాదులో మెయిల్ సంస్థతో పాటు, ప్రైవేటు వ్యక్తులు వాసా నాగరాజు, పోతురాజు మాధవరావులు కూడా అక్రమ మైనింగ్ జరిపారని వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేశారు.

విద్యార్థినుల అదృశ్యం

- గంటల వ్యవధిలో తల్లిదండ్రులకు అప్పగింత

గన్నవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఐదుగురు విద్యార్థినుల అదృశ్యం కేసును గంటల వ్యవధిలో పోలీసులు ఛేదించారు. వారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. గన్నవరం స్టేషన్ సీఐ బీవీ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాదకు చెందిన నలుగురు విద్యార్థినులు విజయవాడలోని ఒక కార్పొరేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిలో ఒక విద్యార్థినికి కళాశాలలో ఫీజు కట్టమని తండ్రి గత శనివారం కొంత నగదు ఇచ్చాడు. ఆ విద్యార్థిని ఆరోజు కళాశాలకు వెళ్లకుండా సహ విద్యార్థినులతో కలిసి పార్కుకు వెళ్లి సరదాగా గడిపారు. సాయంత్రం ఇంటికి వచ్చిన విద్యార్థిని ఫీజు కట్టలేదని తెలియడంతో తండ్రి మందలించాడు. ఈ విషయం తెలిసిన ఆమె స్నేహితులు ఇంటి దగ్గర ఉంటే తల్లిదండ్రులు తిట్టడం కొట్టడం చేస్తారని.. గురువారం ఉదయం విజయవాడ రైల్వే స్టేషన్‌లో కలవాలని నిర్ణయించుకున్నారు. ఐదుగురు కలిసి విజయవాడ వెళ్లి హైదరాబాద్ వెళ్లే రైలు ఎక్కారు. ఇంటిలో కుమార్తె కనిపించకపోవటంతో ఓ విద్యార్థిని కుటుంబీకులు వెంటనే గన్నవరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి విద్యార్థులు రైలులో వెళుతున్నట్టు గుర్తించారు. పిడుగు రాళ్ల స్టేషన్‌లో ఐదుగురిని పట్టుకుని గన్నవరం తీసుకువచ్చారు. వారిని ప్రశ్నించగా తల్లిదండ్రులు తరచూ మందలిస్తున్నారని, చీటికి మాటికి తిడుతున్నారని అందుకే హైదరాబాద్ వెళ్లాలని నిర్ణయించుకున్నామని చెప్పారు. విద్యార్థినులు, తల్లిదండ్రులను తహసీల్దారు ఎదుట హాజరు పరిచారు. కేవీ శివయ్య, సీఐ శివ ప్రసాద్‌లు వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిదే గెలుపు

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి సుభాష్



ఎమ్మెల్సీ బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి సుభాష్, మండలి బుద్ధప్రసాద్, పట్టాభి రామ్ తదితరులు

అవనిగడ్డ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రానున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపు ఖాయమని గ్రాడ్యుయేట్లు, నిరుద్యోగులు, ఉపాధ్యాయుల మద్దతు ప్రభుత్వానికేనని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాసంశెట్టి సుభాష్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం అవనిగడ్డలో కూటమి నేతలతో సమావేశమైన మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గడిచిన ఎనిమిది నెలల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి మద్దతు లభిస్తున్నదన్నారు. ఆరున్నర లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా నాలుగు లక్షల మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడ్డాయని, ఇది పట్టభద్రులు, నిరుద్యోగుల్లో ప్రభుత్వం పట్ల సానుకూలత పెంచే అంశమని సుభాష్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ, ప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారని, రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తీసుకొచ్చిన ఘనత చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లకే దక్కుతుందని తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు సృష్టించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్ గెలుపుకోసం కూటమినేతలు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ నేత బొబ్బా గోవర్దన్, యువనేత మండలి వెంకట్రామ్, కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పూర్తికాగానే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయిన వెంటనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమవుతుందని మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. గురువారం ప్రగతి విద్యాసంస్థలో డీఎస్సీ ఆశావాహులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా గడిచిన ఆరేళ్లుగా డీఎస్సీ ఆశావాహులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయిన వెంటనే ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. డీఎస్సీ ఆశావాహులను నేరుగా కలసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఏజే విద్యాపరిషత్‌కు పునర్వైభవం!

(5వ పేజీ తరువాయి)

పేరుంది. ఇక్కడ పని చేసిన అధ్యాపకులు రచించిన అధిక శాతం పాఠ్యపుస్తకాలే బీఈడీ కోర్సులో పాఠ్యాంశాలుగా నేటికీ కొనసాగుతున్నాయి. ఇక్కడ పనిచేసే అధ్యాపకులంతా పదవీ విరమణ చేయడం, మళ్లీ ఆ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఏజే విద్యాపరిషత్ వివిధ కారణాలతో ప్రైవేటు వ్యక్తి చేతుల్లోకి వెళ్లిపోయింది. 2008 నుంచి2019వరకు కృష్ణాయూనివర్సిటీ ఏజే విద్యాపరిషత్ ప్రాంగణంలోనే నడిచింది. యూనివర్సిటీకి భవనాలు సమకూరడంతో ఇక్కడి నుంచి యూనివర్సిటీని ఖాళీ చేశారు.

దేవదాయశాఖ మంత్రికి వినతి

ఏజే విద్యాపరిషత్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని సీఎం చంద్రబాబు ప్రకటించిన నేపథ్యంలో మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం నగర ప్రముఖులు గత నెలలో ఒకసారి, ఈ నెల 13న దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయశాఖ కమిషనర్‌ను కలసి ఏజే విద్యాపరిషత్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అంశంపై చర్చించారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఏజే విద్యాపరిషత్‌ను ఈ కళాశాల వ్యవస్థాపకులతో సంబంధం లేని వ్యక్తులకు ధారాదత్తం చేయడంపైనా, ఈ విద్యాపరిషత్‌కు వందలాది ఎకరాల భూములు, వాటిపై వచ్చే ఆదాయానికి గండికొట్టి, తప్పుడు లెక్కలు చూపి ప్రైవేటు వ్యక్తికి చెందేలా వెసులుబాటు కల్పించడం తదితర అంశాలపై దృష్టి సారించారు. ఏజే విద్యాపరిషత్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటే న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ఉండేలా ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు.

క్రమశిక్షణ నగరంగా తీర్చిదిద్దాలి

- రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో కృషిచేయాలి
- స్వచ్ఛంద సంస్థలూ కీలక భాగస్వాములే
- డీఆర్‌సీసీ సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాజధాని ప్రాంతానికి ముఖ్య ద్వారమైన విజయవాడను ట్రాఫిక్‌పరంగా క్రమశిక్షణతో కూడిన నగరంగా తీర్చిదిద్దడంలో అధికారులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జరిగిన రహదారి భద్రత కమిటీ (డీఆర్‌సీసీ) సమావేశంలో వివిధ శాఖల అధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో రోడ్డుప్రమాద స్థితిగతులు, బ్లాక్‌స్పాట్‌ల వద్ద తీసుకొన్న చర్యలు, రహదారి భద్రత ఉల్లంఘనలపై చర్యలు, హిట్ అండ్ రన్ మోటారు యాక్సిడెంట్ స్కీమ్-2022, ఐ-రాడ్ అమలు, రహదారి భద్రత అవగాహన కార్యక్రమాలు తదితరాలపై చర్చించారు. సమావేశంలో కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ, రవాణా, పోలీస్, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, జాతీయ రహదారులు, విజయవాడ నగరపాలక సంస్థ తదితర శాఖల అధికారులతో పాటు డీఆర్‌సీసీ ఇతర భాగస్వామ్య పక్షాలు పటిష్ట సమన్వయంతో పనిచేసి రహదారి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరముందన్నారు. స్వచ్ఛంద సంస్థల నివేదికలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి రహదారి ప్రమాదాలు జరగకుండా పటిష్ట కార్యాచరణ అవసరమన్నారు. జిల్లాలో ముఖ్యంగా విజయవాడలో ట్రాఫిక్ వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించేందుకు రియల్‌టైమ్ డేటాను విశ్లేషిస్తున్నామని, ఆ ఫలితాల ఆధారంగా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకొంటున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

గన్నవరంలో భూ బాగోతాలు

(5వ పేజీ తరువాయి)

చేయించారు. వేరొకరి వద్ద కొనుగోలు చేసిన స్థలంలో రేకుల షెడ్డు వేసి ఎరువుల దుకాణం నడుపుతుంటే రాత్రి ఎనిమిది గంటల సమయంలో నోటీసును గోడకు అంటించి తెల్లవారుఝామున దుకాణాన్ని కూల్చివేశారు. దీనికి అప్పటి తహసీల్దార్ నరసింహారావుతో పాటు రెవెన్యూ సిబ్బంది సహకారం అందించారు. రైతులు అడ్డుకుంటే పోలీసులతో కేసులు పెట్టించి వేధించారు. నేలమట్టమయిన దుకాణం రాళ్లను కూడా అక్కడి రోడ్ల గోతులు పూడ్చేందుకు ఉపయోగించారంటే అరాచకం ఏ స్థాయిలో చేశారో అర్థం చేసుకోవచ్చు.

- రేమల్లెకు చెందిన తుమ్మల ఉదయ్‌ను వైసీపీలో చేరాలని ఒత్తిడి చేసినా లొంగక పోవడంతో సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని పోలీస్‌స్టేషన్ తీసుకువెళ్లి బెదిరించారు. అప్పటికీ వినకపోవడంతో అన్ని అనుమతులు తీసుకుని సాగు చేసుకుంటున్న 13 ఎకరాల రొయ్యల చెరువుకు మల్లవల్లిలో పని చేస్తున్న యంత్రాలను తీసుకువచ్చి రాత్రికి రాత్రే గండ్లు పెట్టడంతో పాటు విద్యుత్ కనెక్షన్లు కట్ చేయించారు. దీని వల్ల రూ.35 లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని ఉదయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికంగా ఆ కుటుంబాన్ని దెబ్బతీశారు.
- విజయవాడ మధురానగర్‌కు చెందిన సుంకర సీతామహాలక్ష్మి అనే మహిళ గన్నవరం పట్టణంలో సర్వే నంబర్ 477-2లో 484 చదరపు గజాల స్థలాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అయితే ఆ స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రోద్బలంతో సూరపనేని అనిల్ కుమార్, వైసీపీ జిల్లా నాయకుడైన మేచినేని బాబు మేనల్లుడు శివరామకృష్ణ ఆక్రమించుకుని దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితులు కలెక్టర్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుకు ఫిర్యాదు చేశారు. దీనికి రెవెన్యూ అధికారులు సిహెచ్.నరసింహారావు, పవన్‌కుమార్, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు సహకరించారని ఫిర్యాదులో పేర్కొన్నారు.
- సూరంపల్లి గ్రామానికి చెందిన గొట్టిపూళ్ల రఘునాథ్‌కు సర్వే నంబర్ 366లో 5.77 ఎకరాల భూమి ఉంది. 2019లో అప్పటి ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, అతని అనుచరులు కొమ్మా కోట్లు, సిహెచ్.రవీంద్రబాబు, ఎస్‌కె.ప్రసాద్, పి.గోపిరాజు, కె.నాగబూషణం తదితరులు తనను బెదిరించి, కుటుంబ సభ్యులను చంపుతామని భయపెట్టి రూపాయి కూడా ఇవ్వకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాధితుడు గొట్టిపూళ్ల రఘునాథ్ తెలిపారు. తనకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.
- గన్నవరం టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావుకు సూరంపల్లిలో సర్వే నంబర్ 308-4లో 99 సెంట్లు పూర్వాజితంగా వచ్చింది. 1964లో ప్రభుత్వం బీఫారం పట్టా కూడా ఇచ్చింది. 1999లో నగదు కట్టించుకుని డిఫారం పట్టాను మంజూరు చేసింది. 2019లో వెంకటేశ్వరరావు తల్లి మృతి చెందడంతో, ఆ భూమిని తన పేరున మార్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే వంశీతో పాటు ఆయన వైసీపీలోకి రాలేదనే అక్కసుతో ఆ భూమిని ప్రభుత్వ భూమి అంటూ రెవెన్యూ అధికారులతో బోర్డులు పెట్టించారు. ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సిద్ధం చేశారు. ఆ భూమిలో ఉన్న షెడ్డును జేసీబీలతో అక్రమంగా కూల్చివేయించారు. ఇదేమని ప్రశ్నిస్తే కేసులు పెడతామని బెదిరించారు. ముందుగా ఆ భూమిలోకి వంశీతో పాటు వైసీపీ నాయకులు, తహసీల్దారు నరసింహారావు వెళ్లి చూశారు. ఆ తర్వాత బోర్డులు పెట్టి కూల్చేశారు.

అంగన్వాడీ కేంద్రంలో ఫుడ్ పాయిజన్

(5వ పేజీ తరువాయి)

సంఘం నేత బాణావతు బీమ్లా నాయక్ ఆటోలో చిన్నారులను మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరబల చంటి కుమారుడు పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఎ.కొండూరు పీహెచ్‌సీ డాక్టర్ సహకారంతో మైలవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులకు చికిత్స అందిస్తున్నారు. ఆస్పత్రిలో చిన్నారులను తిరువూరు ఎమెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పరామర్శించారు. కాగా, ఇటీవల దీప్లానగర్ తండాలో బర్డ్‌ఫ్లూ లక్షణాలతో మూడు వేల కోళ్లు మృతి చెందగా, ఈ ప్రాంతంలో కోడి గుడ్లు, చికెన్ తినవద్దని ప్రచారం నిర్వహించారు. అయిన అభం శుభం తెలియని చిన్నారులకు కోడి గుడ్డు పెట్టడం ఏమిటని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. చిన్నారులకు అస్వస్థతగా ఉన్న సాయంత్రం వరకు తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వలేదని, ప్రాణాలకు హాని జరిగితే ఎవ్వరు బాధ్యత వహిస్తారని అంగన్‌వాడీ సిబ్బందిని నిలదీశారు.

ఒకరి సొమ్ము మరొకరికి జమ

(5వ పేజీ తరువాయి)

జ్యోతిరాణితో మాట్లాడి డబ్బులు రికవరీ చేయించే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. ఆమె డబ్బులు పూర్తిగా చెల్లించటానికి అంగీకారం తెలిపినట్టుగా సమాచారం. ఈ దశలో ట్రెజరీ అధికారులు నగదుగా వీరాస్వామికి డబ్బులు చెల్లిస్తే పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆ డబ్బులను చలానా రూపంలో ట్రెజరీకి చెల్లించాలని మెలిక పెట్టారు. కానీ చలానా ఏ ప్రాతిపదికన కట్టించాలి అన్న అంశంపైనా ట్రెజరీ అధికారులు కూడా తర్జన భర్జన పడుతున్నారు.

ఉద్యోగులు కావాలని చేశారా?

గ్యాంగ్ మజ్దూర్ వీరాస్వామికి చెల్లించాల్సిన నగదును బొడ్డు జ్యోతిరాణికి చెల్లించడంలో ఆఫీసు ఉద్యోగుల పాత్రమైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆఫీసు సూపరింటెండెంట్ దీనికి బాధ్యత వహించాల్సి ఉంది. చెల్లింపులకు సంబంధించి ఆయన లాగిన్ ద్వారానే జరగాలి. దీనికి విరుద్ధంగా వై.అనిల్ కుమార్‌రెడ్డి అనే దివ్యాంగ ఉద్యోగి లాగిన్ ద్వారా డబ్బులు చెల్లించినట్టు తెలుస్తోంది. దివ్యాంగ ఉద్యోగితో లాగిన్ ఓపెన్ చేసి అతని ద్వారా పేమెంట్స్ ఎలా చేస్తారన్నది ప్రశ్నగా ఉంది. దివ్యాంగ చిరుద్యోగిని బలి పశువును చేసేందుకు ఈ పని చేశారా అన్న విమర్శలు వస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో కార్యాలయ సూపరింటెండెంట్ పాత్రపై పలు ఆరోపణలు వస్తున్నాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన దివ్యాంగ ఉద్యోగి

ఈ వ్యవహారంలో తనను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని దివ్యాంగ ఉద్యోగి వై.అనిల్ కుమార్‌రెడ్డి కలెక్టర్ లక్ష్మీశకు ఫిర్యాదు చేశారు. తన పేరుతో లాగిన్ ఓపెన్ చేసి చెల్లింపులు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాట్లాడలేని సదరు దివ్యాంగ ఉద్యోగి రాసి వచ్చిన ఫిర్యాదుపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

గన్నవరం విమానాశ్రయానికి జవాన్ భౌతికకాయం

గన్నవరం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ జవాన్ మృతదేహం గన్నవరం విమానాశ్రయానికి చేరింది. బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన పరిశ మోహన వెంకటేశ్(26) గుజరాత్ ఆర్మీలో పని చేస్తున్నాడు. గన్ క్లీనింగ్ చేస్తుండగా మిస్ ఫైర్ అవడంతో మృతి చెందాడు. ఆ మృతదేహాన్ని గురువారం ఢిల్లీ నుంచి ఇండిగో విమానంలో మధ్యాహ్నం 1.50 గంటలకు తీసుకొచ్చారు. అక్కడ ఆర్మీ అధికారులు గార్డ్ ఆఫ్ హానర్ చేసి ఆర్మీ లాంఛనాలను పూర్తి చేసి పార్థివ దేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకువెళ్లారు.

కేఎస్ లక్ష్మణరావు విజయానికి ప్రజా సంఘాల ప్రచారం

ఉంగుటూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా గురువారం మండలంలోని తరిగొప్పల, వెల్దిపాడు, తేలప్రోలు గ్రామాల్లో ప్రజాసంఘాల నేతలు ముమ్మర ప్రచారం చేశారు. వ్యవసాయకార్మికసంఘం జిల్లా సహాయకార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు నేతృత్వంలో నాయకులు పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీచేశారు. కేఎస్ లక్ష్మణరావుకి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీఐటీయూ నాయకులు సత్యనారాయణ, సుందరయ్య, ప్రసాదరావు, పి.మహేష్, రామ్మోహనరావు, ఎస్కేఎం సలీం, ఎస్.వెంకటేశ్వరరావు, డి.శ్రీనివాసరావు, బి.సుబ్బారెడ్డి, సాంబశివరావు, రంగారావు పాల్గొన్నారు.

సీఐటీయూ ప్రచారం

హనుమాన్‌జంక్షన్: కృష్ణా, గుంటూరు పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వై.నరసింహారావు ఓటర్లను కోరారు. ఆయన ప్రజా సమస్యలను మేధావుల సభలో ప్రస్తావించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. గురువారం లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ జంక్షన్‌లో పట్టభద్రులను కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ బాపులపాడు మండల నాయకులు బేత శ్రీనివాసరావు, రాజనాల సురేశ్, శ్యామ్, జుజ్జువరపు ఏసుపాదం, వంగపండు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హనుమాన్‌జంక్షన్‌లో కూటమి నాయకుల ప్రచారం



కాకులపాడు, వేలేరులో..

'ఆలపాటి'ని గెలిపించండి

● కూటమి నేతల విస్తృత ప్రచారం

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కూటమి బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను ప్రథమ ప్రాధాన్య ఓటుతో గెలిపించాలని గురువారం జంక్షన్‌లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు అట్లూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నమూన బ్యాలెట్ పేపరు, కరపత్రాలను అందించి, ఓటు వేయడంపై అవాహన కల్పించారు. టీడీపీ పట్టణ కార్యదర్శి గార్లపాటి రాజేశ్వరరావు, చిన్నాల లక్ష్మీనారాయణ, కాకులశ్రీను, వరిగంజి కిషోర్, యలమంచిలి వెంకటేశ్వరరావు, కర్రా ప్రసాద్‌పాల్, కడవకొల్లు రాజేశ్, పొట్లూరి పణి, ప్రకాశ్ పాల్గొన్నారు.

కాకులపాడు, వేలేరులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు ప్రథమ ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలంటూ ఓటర్లను టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి చలసాని శ్రీనివాస్, వేములపల్లి శ్రీనివాసరావు కోరారు. కాకులపాడు, వేలేరులో గురువారం వారు ప్రచారం నిర్వహించారు. జాస్తి భూపతిరావు, సత్యనారాయణ, అవిర్నేని భవానీశంకర్, సురేష్ పాల్గొన్నారు.

కంకిపాడులో..

కంకిపాడు: ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను గెలిపించాలంటూ గురువారం కంకిపాడులో టీడీపీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో నేతలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. టీడీపీ నేతలు పులి శ్రీనివాసరావు, కొండా నాగేశ్వరరావు, గోగినేని వెంకటరమణ, చిట్టూరి నాగేశ్వరరావు, జనసేన నాయకులు బోయిన నాగరాజు, సుంకర శివ, బీజేపీ నాయకులు దివి రోహిణి, కృష్ణమోహన్‌పాల్గొన్నారు. గోసాలలో రాంబాబు, కోనేరు సాంబయ్య, షేక్ సలీం ఇంటింటి ప్రచారం చేశారు.



స్ట్రాంగ్‌రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

ఉయ్యూరు రెవెన్యూ డివిజన్‌లో 25 పోలింగ్ కేంద్రాలు : కలెక్టర్ బాలాజీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'ఈనెల 27వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటలవరకు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహిస్తాం. అందుకోసం ఉయ్యూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 25 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. తాడిగడప మున్సిపల్, పెనమలూరు మండల పరిధిలో 11, కంకిపాడు, ఉయ్యూరు, తోట్లవల్లూరు మండలాల్లో 8, పామర్రు, మొవ్వ, పమిడిముక్కల మండలాల్లో 6 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం.' అని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డీకే బాలాజీ, తెలిపారు. బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రి తరలించేందుకు ఏర్పాటుచేసిన డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్‌ను, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు ఉంచేందుకు ఉయ్యూరు ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను ఎస్పీ ఆర్.గంగాధరరావుతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రంలో నాలుగు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటుచేసి బ్యాలెట్ బాక్సులు, పోలింగ్ సామగ్రి పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. పోలింగ్ సామగ్రి తరలించేందుకు సెక్టార్ రూట్ వారీగా ప్రత్యేక వాహనాలు ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు. ఆర్డీవో హేలాషారోన్, తహసీల్దార్ సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.



సీహెచ్‌సీ ఆవరణలో మొక్క నాటుతున్న డాక్టర్ సంజయ్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

వైద్యాధికారి సంజయ్

కంకిపాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి, దాని సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సంజయ్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి ఆవరణలో గురువారం ఆయన మొక్కలు నాటారు. డాక్టర్ ఇబ్రహీం పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మేనేజర్ భానుకిరణ్

సృజనాత్మకతతో కూడిన విద్యతోనే నైపుణ్యాభివృద్ధి సాధ్యం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సృజనాత్మకతతో కూడిన విద్యతోనే విద్యార్థుల్లో నైపుణ్యాలు వృద్ధి చెందుతాయని ఎంటర్‌ప్రెన్యూర్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ) జిల్లా మేనేజర్ భానుకిరణ్ అన్నారు. కానుమోలు హైస్కూల్‌లో గురువారం విద్యార్థులకు డిజైనింగ్ ఏ సొల్యూషన్ అండ్ ప్రోటో టైపింగ్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. హెచ్‌ఎం పద్మజ, రిసోర్స్ పర్సన్ దయాకర బాబు, పీఈటీ రామచంద్రుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో కేక్ కట్ చేస్తున్న బ్రహ్మకుమారీలు భారతి, మాధవి

వైభవంగా శివజయంతి

ఉయ్యూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో గురువారం శివజయంతి కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మచిలీపట్నం కేంద్రం నుంచి భారతి హాజరయ్యారు. స్థానిక కేంద్రం నిర్వాహకురాలు మాధవితో కలసి కేక్ కట్‌చేసి పంచారు. ఈశ్వరీయ విశ్వవిద్యాయం లక్ష్యాలను వివరించారు. ప్రేమ, దయ, క్షమా గుణాలతో జీవించి జీవితాన్ని సార్థకం చేసుకోవాలన్నారు.



వీరమ్మ ఆలయం వద్ద భారీ అన్న సమారాధన

ఉయ్యూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వీరమ్మ తిరునాళ్లలో 13వ రోజు గురువారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చార్ట్ కౌన్సెలింగ్ రద్దు చేసే వరకు ఉద్యమిస్తాం

నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి



7వ రోజు రిలేదీక్షలో కూర్చున్న పీటీడీ ఉద్యోగులు

ఉయ్యూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్యాలయం సర్క్యులర్‌కు విరుద్ధంగా జరిపిన చార్ట్ కౌన్సెలింగ్ రద్దు చేసేవరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, కోశాధికారి గణేశ్ హెచ్చరించారు. ఉయ్యూరు ఆర్టీసీ డిపోలో నిబంధనలకు వ్యతిరేకంగా జరిపిన చార్ట్ కౌన్సెలింగ్‌ను రద్దుచేసి తిరిగి కౌన్సెలింగ్ జరపాలని అసోసియేషన్ డిపో అధ్యక్షుడు పెరవలి మురళీకృష్ణ ఆధ్వర్యంలో పీటీడీ ఉద్యోగులు చేస్తున్న రిలే దీక్ష గురువారానికి 7వ రోజుకు చేరింది. దీక్షను నాగిరెడ్డి, గణేశ్ ప్రారంభించారు. చార్ట్ కౌన్సెలింగ్‌కు వ్యతిరేకంగా ఉద్యోగులు రెండు వారాలుగా వివిధ రూపాల్లో నిరసన తెలుపుతున్నా పట్టించుకోకుండా డిపో మేనేజర్ సిక్‌లీవ్‌లో వెళ్లడం బాధాకరమన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా అధ్యక్షుడు డీవీ రావు దీక్షా శిబిరాన్ని సందర్శించి మద్దతు పలికారు. ఎ.సాంబశివరావు, బీవీ రావు దీక్షలో పాల్గొన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆవుల శ్రీనివాసరావు, డిపో సెక్రటరీ పీఎం కృష్ణ, అసిస్టెంట్ సెక్రటరీ అరుణోదయ, కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు సంఘీభావం తెలిపారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు

బాలల సమగ్ర వికాసం కోసమే జ్ఞానజ్యోతి శిక్షణ

ఉంగుటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మూడు నుంచి ఆరేళ్లలోపు బాలల సమగ్ర వికాసం, అభివృద్ధికి తోడ్పాటునందించడమే లక్ష్యంగా విద్యాశాఖ, స్త్రీశిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారని, అంగన్వాడీ కార్యకర్తలందరూ వినియోగించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో పి.వెంకటలక్ష్మి, ఎంఈవో-2 జె.సాంబశివరావు సూచించారు. ఉంగుటూరు జడ్పీ హైస్కూల్‌లో మొదటి విడతగా ఈనెల 18నుంచి 20వతేదీ వరకు నిర్వహించిన జ్ఞానజ్యోతి 120రోజుల(సర్టిఫికెట్ కోర్సు) శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో వారు మాట్లాడారు. శిక్షణల్లో నేర్చుకున్న అంశాలను అంగన్వాడీ కేంద్రాల్లో అమలుచేయాలని సూచించారు. ఈనెల 22నుంచి 24వరకు రెండవ విడత శిక్షణ తరగతులు జరుగుతాయని పేర్కొన్నారు. హెచ్‌ఎం చోరగుడి అనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు బి.పద్మాదేవి, ఎల్.దుర్గాదేవి, ఫ్యాకల్టీ జగదీష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గుడివాడ డీఎల్‌పీవో సంపత్ కుమారి

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

● పంచాయతీ కార్యదర్శులు, క్లాప్, షెడ్ మిత్రల శిక్షణలో డీఎల్పీవో సంపత్‌కుమారి

గన్నవరం, ఫిబ్రరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలని గుడివాడ డీఎల్పీవో సంపత్‌కుమారి సూచించారు. సూరంపల్లి ఎస్‌డబ్ల్యూపీసీ వద్ద గురువారం తడి, పొడి చెత్త సేకరణపై పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్ర, షెడ్ మిత్రలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు ప్రజలు సహకరించాలని ఆమె కోరారు. మండల ప్రతేకాధికారి విజయసారథి, ఎంపీడీవో టి.స్వర్ణలత, ఈవోపీఆర్డీలు భారతి, లక్ష్మయ్య, ట్రైనర్ కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మణరావు, చెన్నకేశవులు, ప్రసాద్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బస్సు అద్దాలు ధ్వంసం.. ఇద్దరి అరెస్టు

ఉయ్యూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బస్సు డ్రైవర్‌పై దాడిచేసి అద్దాలు పగులగొట్టిన ఇద్దరు వ్యక్తులను గురువారం పోలీసు అదుపులోకి తీసుకున్నారు. అవనిగడ్డ నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ అద్దె బస్సు ఉయ్యూరు సెంటర్‌కు చేరుకుని కాటూరు రోడ్డు వైపు వెళుతుండగా ట్రాఫిక్ అడ్డురావడంతో డ్రైవర్ కిరణ్ రాజు హారన్ మోగించాడు. దీంతో బస్సు ముందు ద్విచక్రవాహనంపై ఉన్న బొల్లా రవీంద్ర, జంపన నరేంద్ర ఆగ్రహించి డ్రైవర్‌పై వాగ్వాదానికి దిగి దాడి చేసి బస్సు అద్దాలు పగుల గొట్టారు. డ్రైవర్ కిరణ్ రాజు, కండక్టర్ బాలకోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసునమోదు చేసినట్టు ఎస్సై విశ్వనాథ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రసాదంపాడు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎనికేపాడు సెక్షన్ 11కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు రామవరప్పాడులోని చిన్మయ్ ఏరియా, వాటర్ ట్యాంక్ రోడ్డు, పటేల్ వారి వీధి, ఎస్‌బీఐ బ్యాంకు ఏరియా, రంగా బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పరమేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

పంచతంత్ర ప్రభావంపై 23న సమావేశం

ఉయ్యూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): యక్షప్రశ్నలు, పంచతంత్రం ప్రభావం, పిల్లల్లో ప్రతిభ పురికొల్పే అంశంపై ముదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు సమావేశం ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. పిల్లలు-పరీక్షలు-ప్రతిభ అనే అంశంపై రాజకీయాలకతీతంగా సమగ్రచర్చను కలెక్టర్ డీకే బాలాజీ ప్రారంభిస్తారని, సత్యవాణి, ప్రేమ్‌చంద్, శాంతిస్వరూప్, జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు పలువురు ప్రముఖులు ఈకార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు.

పత్రాలు లేని ఆటోలు సీజ్

గుణదల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పత్రాలు లేకుండా ఆటోలు నడుపుతున్న వారిని గుర్తించి నాలుగు ఆటోలు సీజ్ చేశామని నాలుగో ట్రాఫిక్ ఎస్సై ఆదినారాయణ తెలిపారు. రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద రైలు వచ్చిన సమయంలో ప్రయాణికులను ఎక్కించుకునేందుకు సర్వీసు ఆటోలను జాతీయ రహదారిపై అడ్డంగా నిలపడంతో వాహనాల రాకపోకలకు ఆటంకంగా ఉంటోంది. రోజూ ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ భారీగా నిలిచిపోతోంది. ఆటోలను రోడ్డు పక్కన పెట్టించేందుకు గురువారం సిబ్బందితో వచ్చిన ఎస్సై ఆదినారాయణ వాహనాల పత్రాలను పరిశీలించారు. రామవరప్పాడు వంతెన సెంటర్ వద్ద జాతీయరహదారి మధ్యలో ఆటోలు నిలిపితే భారీ జరిమానాలు విధిస్తామని ఎస్సై ఆదినారాయణ హెచ్చరించారు.

కుంభమేళాకు ఆర్టీసీ బస్సు

గుడివాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుడివాడ నుంచి కుంభమేళాకు గురువారం ఆర్టీసీ బస్సు బయలుదేరింది. ఆర్టీసీ యూనియన్ నాయకుడు బస్సును ప్రారంభించారు. గుడివాడ పరిసర ప్రాంత ప్రజలకు మహా కుంభమేళాలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు ఆయన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాహకుడు బెజవాడ సురేష్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐలూరు ఉత్సవాలను విజయవంతం చేయాలి

● అధికారులతో సమీక్షలో తహశీల్దార్ కుసుమకుమారి

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఐలూరులో ఈనెల 26న నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్ ఎం.కుసుమ కుమారి సూచించారు. ఐలూరు శ్రీరామేశ్వరస్వామి దేవస్థానం వద్ద గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. దేవస్థానం వద్ద భక్తులు దైవదర్శనం చేసుకునేందుకు బారికేడ్లు, ఇతర సదుపాయాలు, నదీపాయలో భక్తులు జల్లుస్నానాలు చేసేందుకు బోర్ల నిర్మాణం, మంచినీటి వసతులు, పారిశుధ్య చర్యలపై చర్చించారు. కార్యాచరణ పనులు మొదలు పెట్టాలని తహశీల్దార్ సూచించారు. లక్షమందికిపైగా భక్తులు వస్తారని, వారికి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేవస్థానం భూముల వివరాలను, వచ్చే ఆదాయాన్ని తెలపాలని సర్పంచ్ పీరాటి సుజాత డిమాండ్ చేయగా దేవస్థానానికి 50 ఎకరాలు మాత్రమే ఉన్నాయని ఈవో శివగోపాల్ తెలిపారు. పంచాయతీ నుంచి అన్ని పనులు చేయటం సాధ్యం కాదని చెప్పి మధ్యలోనే సర్పంచ్ వెళ్లిపోయారు. ఎంపీడీవో రవికాంత్, సీఐ వై.చిట్టిబాబు, ఎస్సై సీహెచ్ అవినాష్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

25 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

గుడివాడ: భీమేశ్వరస్వామి దేవస్థానం, గౌరీశంకరస్వామి దేవస్థానంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు వార్షిక మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తామని ఈవో కె.వి.గోపాలరావు తెలిపారు.



హెల్మెట్ లేకుండా ప్రయాణం.. పోలీసులను చూసి హెల్మెట్ పెట్టే ప్రయత్నం.. ద్విచక్రవాహనాన్ని పక్కన పెట్టాలంటూ పోలీసుల సూచన.. ఇప్పుడు హెల్మెట్ పెట్టి ఏం లాభమంటూ నిట్టూర్పు



పోలీసుల తనిఖీలను చూసి హెల్మెట్ పెట్టుకుంటున్న ద్విచక్రవాహనదారులు

అబ్బా.. ఏం తెలివి

నగరంలో పోలీసుల తనిఖీలు పెరుగుతున్నాయి. ఎక్కడికక్కడ వాహనాలను ఆపి హెల్మెట్ లేని వాహనాలకు చలానాలు విధిస్తున్నారు. దీంతో కొంతమంది వాహనదారులు అతి తెలివి చూపిస్తున్నారు. హెల్మెట్ బైక్ ట్యాంకర్‌పై ఉంచి ప్రయాణిస్తూ కొంతదూరంలో తనిఖీలు జరుగుతున్నాయని కనిపిస్తే వెంటనే ఆపేసి హెల్మెట్ పెట్టుకుని తనిఖీల ప్రదేశాన్ని దాటేశాక మళ్లీ హెల్మెట్ తీసేస్తున్నారు. మరికొందరు వెనక్కి తిరిగి ట్రాఫిక్‌కు ఎదురు వెళ్తుండటంతో మిగతా వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. వాహనదారుల భద్రత కోసం ఏర్పాటు చేసిన నియమాలను గౌరవించకుండా, అతి తెలివితేటలతో ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి



పోలీసుల తనిఖీలను చూసి హెల్మెట్ లేకపోవడంతో వెనుదిరుగుతున్న ద్విచక్రవాహనదారులు

ల్యాంకోలైన్‌కు లైసెన్స్ ఉందా?

● 25వ తేదీలోపు చెప్పండి.. లేకుంటే సెంట్రల్ పవర్ మినిస్ట్రీ సెక్రటరీని పిలుస్తాం ● ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు ధర్మాసనం



- ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ పవర్ లైన్స్ లైసెన్స్‌పై సంస్థల దోబూచులాట
- ల్యాంకో లైన్‌కు లైసెన్స్ లేకపోతే.. తొలగింపునకు ఆదేశాలిచ్చే అవకాశం?
- ఇదే జరిగితే లైన్ లాస్ పేరుతో చెల్లించిన రూ.14కోట్లు ఎవరి జేబుల్లోకి..?

ఆంధ్రజ్యోతి, విజయవాడ: విజయవాడ వెస్ట్ బైపాస్ వెంబడి వివాదాస్పదంగా మారిన ల్యాంకో ట్రాన్స్‌మిషన్ హైటెన్షన్ టవర్ లైన్స్‌కు సంబంధించి లైసెన్స్ వివాదం తెరపైకి వచ్చింది. లైసెన్స్ లేకుండా లైన్లను నిర్వహిస్తున్నారని రైతులు కేసులు వేయడంతో హైకోర్టులో లోతైన విచారణ జరుగుతోంది. ల్యాంకో పవర్ లైన్స్‌కు సంబంధించి లైసెన్స్ లేని విషయాన్ని ఆ సంస్థ దాచి పెడుతోంది. హైకోర్టులో విచారణ సందర్భంగా ల్యాంకో పవర్ ప్రాజెక్టు నుంచి కానీ, ల్యాంకో లిక్విడేటర్ నుంచి కానీ, ఈ లైన్‌ను ఆక్షన్‌లో కొనుగోలు చేసిన మయన్మార్ కంపెనీ కానీ, లైన్‌ను కొనుగోలు చేసిన మయన్మార్ కంపెనీతో తాము ఒప్పందం కుదుర్చుకున్నామని చెబుతున్న రాధా సంస్థ కానీ ఎక్కడా హైకోర్టుకు లైసెన్స్ ఉన్నదీ, లేనిదీ చెప్పటం లేదు. దీంతో తాజాగా హైకోర్టు సీజే చాలా సీరియస్ అయ్యారు. మీరు కనుక మార్చి 25లోపు లైసెన్స్ విషయం తేల్చకపోతే కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ సెక్రటరీని వర్చువల్‌గా విచారణకు హాజరయ్యేలా ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీంతో ల్యాంకో ట్రాన్స్‌మిషన్ పవర్ లైన్స్ లైసెన్స్ అంశం వివాదాస్పదంగా మారుతోంది. సెంట్రల్ పవర్ మినిస్ట్రీ సెక్రటరీ కనుక వర్చువల్‌గా హాజరై లైసెన్స్ లేదని చెబితే మాత్రం ల్యాంకో పవర్ లైన్‌నే తొలగించమని హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలిచ్చే అవకాశం ఉంది. దీంతో ఇప్పటి వరకు ఈ లైన్‌ను అడ్డం పెట్టుకుని అలైన్‌మెంట్ మార్పు పేరుతో రైతులను నానా ఇబ్బందులు పెడుతున్న ఎన్‌హెచ్, రాధా, ల్యాంకో, పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులు న్యాయస్థానంలో దోషులుగా నిలబడే అవకాశం ఉంటుంది.

దీంతో పాటు అన్యాయంగా ప్రభుత్వ సొమ్ము రూ.14 కోట్లను లైన్‌లాస్ పేరుతో రాధా సంస్థకు చెల్లించటం కూడా చాలా తీవ్రమైన అంశంగా మారటంతోపాటు ఈ డబ్బులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో కూడా తేలనుంది.



కేంద్ర మంత్రి సతీష్‌చంద్ర దుబేతో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, కొనకళ్ల, బూరగడ్డ

గనుల్లో రాష్ట్ర వాటా ఇచ్చేస్తాం

కేంద్ర గనుల మంత్రి సతీష్‌చంద్ర దుబే

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్న రాష్ట్రానికి రావల్సిన వాటాను కేటాయిస్తామని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి సతీష్‌చంద్రదుబే అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని సత్య కన్వెన్షన్ సెంటర్‌లో ఎస్‌ఎల్‌సీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ మోటుపల్లి ప్రసన్నకుమార్ ప్రియాంక వివాహానికి కేంద్ర మంత్రి సతీష్ చంద్రదుబే గురువారం హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, ఎంపీ వల్లభనేని బాలశౌరి, మాజీ డిప్యూటీ స్పీకర్, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, పలువురు ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి దుబేతో మంత్రి కొల్లు రవీంద్ర గంటన్నరసేపు చర్చలు జరిపారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందాల్సిన నిధులపై చర్చించారు. టీడీపీ స్థానిక నేత గోపు సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

● కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పూర్తిస్థాయి ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల వద్ద చేస్తున్న ఏర్పాట్లను ఎస్పీ ఆర్ గంగాధరరావుతో కలిసి మచిలీపట్నం, ఉయ్యూరులో గురువారం ఆయన పరిశీలించారు. మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు డివిజన్‌లలో సామగ్రి పంపిణీ, రిసెప్షన్ కేంద్రాల వద్ద ఎన్నికల సామగ్రి పంపిణీకి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలకు సిబ్బందిని, మెటిరియల్‌ను తరలించేందుకు వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఈనెల 27న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, పూర్తయ్యాక బ్యాలెట్ బాక్సులు తరలించేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ రిసెప్షన్ కేంద్రాలు, పోలింగ్‌స్టేషన్ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది మినహా వేరే వ్యక్తులను డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లోకి అనుమతించబోమన్నారు. మచిలీపట్నం, ఉయ్యూరు ఆర్డీవోలు కే స్వాతి, హేలా షారోన్, అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.



నోబుల్ కళాశాలలో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు

ఏడీసీఎల్‌కు బ్యూటిఫికేషన్ బాధ్యతలు

- ఎయిర్‌పోర్టు నుంచి రామవరప్పాడు రింగ్ వరకు 13 కిలోమీటర్లు
- అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ నుంచి ఏడీసీఎల్‌కు నిర్వహణ బాధ్యతలు
- రాజధాని పనులు ఊపందుకోనున్న నేపథ్యంలో కీలక పరిణామం

ఆంధ్రజ్యోతి, విజయవాడ: 16వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16)పై వీఐపీ కారిడార్ బ్యూటిఫికేషన్ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్)కు అప్పగించింది. గన్నవరంలోని విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు 13 కిలోమీటర్ల నిడివిన బ్యూటిఫికేషన్ బాధ్యతలను ఇకపై ఏడీసీఎల్ పర్యవేక్షించనుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వీఐపీ కారిడార్ బాధ్యతలను ఏడీసీఎల్‌కు అప్పగించగా తర్వాత సీఆర్‌డీఏకు బదలాయించింది. ఎన్‌హెచ్-16పై సెంట్రల్ డివైడర్, రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ డివైడర్స్‌పై ల్యాండ్‌స్కేపింగ్, బ్యూటిఫికేషన్ మెయింటెనెన్స్ పనులను సీఆర్‌డీఏ చేపట్టింది. తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఆర్‌డీఏకు నిధుల కేటాయింపు లేకపోవటంతో కొంతకాలం పర్యవేక్షణ లేకుండా పోయింది. ఆ తర్వాత విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ (వీఎంసీ)కు కొన్నాళ్లు, ఏపీ అర్బన్ గ్రీన్ కార్పొరేషన్‌కు కొన్నాళ్లపాటు అప్పగించారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీఐపీ కారిడార్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు ఏపీ అర్బన్ గ్రీన్ కార్పొరేషన్ నుంచి అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీఎల్)కు అప్పగించారు. ఇకపై ఈ బ్యూటిఫికేషన్ బాధ్యతలను ఏడీసీఎల్ నిర్వహించనుంది. అమరావతి రాజధాని ప్రాంతంలో చాలా పెద్ద ఎత్తున బ్యూటిఫికేషన్ పనులను ఏడీసీఎల్ చేపట్టారు. సీడ్ యాక్సెస్ రోడ్డులో అయితే రకరకాల పుష్పజాతులతో ఆహ్లాదకరంగా ఉండేలా మార్చేసింది. వచ్చే నెల నుంచి రాజధాని పనులు ఊపందుకోనున్న నేపథ్యంలో అమరావతికి దేశ విదేశాల నుంచి వచ్చే వారికి వీఐపీ కారిడార్‌లో చక్కటి ఆహ్లాదం కనిపించేలా ఏడీసీఎల్ బ్యూటిఫికేషన్ చేపట్టనుంది. ప్రస్తుతం ఉన్న ల్యాండ్ స్కేపింగ్‌తో పాటు అదనంగా మరింత అందంగా ద్విగుణీకృతంగా కనిపించేలా గ్రీన్‌బెల్ట్‌లను అభివృద్ధి చేయనుంది.



విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే రహదారిలో నిడమానూరు వద్ద బ్యూటిఫికేషన్



ప్రచార చిత్రాలను ఉద్యోగినులకు అందజేస్తున్న నిర్మలాకుమారి

మహిళా ఉద్యోగులు పోటీల్లో పాల్గొనండి

● ఏపీ ఎన్జీవో మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మలాకుమారి

కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగం అధ్వర్యంలో మహిళా ఉద్యోగులకు నిర్వహించనున్న ఆటలపోటీలు, వక్తృత్వం, వ్యాసరచన పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని అసోసియేషన్ మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మలా కుమారి పిలుపునిచ్చారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగం ఆధ్వర్యంలో మార్చి 4,5న ఇందిరాగాంధీ స్టేడియం, ఏపీ ఎన్జీవో హోం నందు నిర్వహించే మహిళల ఆటల పోటీలతో పాటు వివిధ పోటీలపై గురువారం ఆమె నగరంలోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాలను సందర్శించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళా ఉద్యోగుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి శారీరక, మానసిక ఉల్లాసాన్ని పెంపొందించేందుకు ఏటా మహిళా ఉద్యోగులకు ఆటల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మార్చి 4,5 తేదీల్లో ఐజీఎంసీ స్టేడియం, గాంధీనగర్ ఏపీ ఎన్జీవో హోంలో ఆటల పోటీలను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన మహిళా ఉద్యోగులు పోటీల్లో పాల్గొనేందుకు తరలివస్తారన్నారు. పోటీలకు ఆతిథ్యమిచ్చే ఎన్టీఆర్ జిల్లా మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయడంలో భాగస్వాములు కావాలని కోరారు. రవాణా శాఖ ఉద్యోగులు వి.ఉమామహేశ్వరి, రాజ్యలక్ష్మి, మాధవి, కె.శివలీల, విజయశ్రీ, రవాణా ఉద్యోగుల సంఘం జోనల్ అధ్యక్షుడు ఎం.రాజుబాబు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని అన్ని 'బార్'ల ఎన్నికలు మార్చి 27నే

● ఆదేశాలు జారీ చేసిన బార్ కౌన్సిల్ సెక్రటరీ

లీగల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్ల ఎన్నికలు మార్చి 27నే నిర్వహించుకోవాలని రాష్ట్ర బా ర్ కౌన్సిల్ కార్యదర్శి బి.పద్మావతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 3న నోటీస్ బోర్డులో ఓటర్ల లిస్ట్ డిస్‌ప్లే, మార్చి 6న ఎన్నికల నోటిఫికేషన్, మార్చి 10న ఎలక్షన్ ఆఫీసర్ నియామకం, మార్చి 17న నామినేషన్‌ల దాఖలు, మార్చి 19న నామినేషన్ల పరిశీలన, మార్చి 20న నామినేషన్ల ఉపసంహరణ, మార్చి 21న అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, మార్చి 27న ఎన్నికలు నిర్వహించాలని కౌన్సిల్ సెక్రటరీ ఆ ప్రకటనలో తెలిపారు. పో లింగ్ ఉదయం 10 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఉంటుందన్నా రు. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించాలన్నారు. దీంతో రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్లలో తేదీ ఖరారైనట్టే.

ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వండి

మంత్రి లోకేశ్‌కు స్టెల్లా యాజమాన్యం విజ్ఞప్తి

పటమట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): 6 దశాబ్దాలుగా కృష్ణాజిల్లాలో వేలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను బోధిస్తూ మంచి పేరు పొందిన సెల్టా కళాశాల విద్యార్థులకు గత ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు స్కాలర్‌షిప్స్ నిలిపివేశారని, సెల్టా యాజమాన్యం విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకువెళ్లారు. గురువారం గద్దె రామ్మోహన్ ఆధ్వర్యంలో సెల్టా కళాశాల యాజమాన్యం మంత్రి లోకేశ్‌ను కలిసి వారి సమస్యలను వివరించారు. కళాశాలలో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని (గ్రాంట్)ను నిలిపేశారని వివరించారు. కళాశాలపై తీవ్ర ఆర్థిక భారం పడటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. గతంలో వచ్చిన ఆర్థిక సాయాన్ని కొనసాగించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ జసింతా క్వాడ్రస్ పాల్గొన్నారు.



మంత్రి నారా లోకేశ్‌ను కలిసి సమస్య వివరిస్తున్న సెల్టా కళాశాల యజమాన్యం

మా ఊరికి రోడ్లు వేశారోచ్

● కూటమి ప్రభుత్వం వచ్చాక నంగేగడ్డలో మూడు సీసీ రోడ్ల నిర్మాణం ● గ్రామస్థుల హర్షాతిరేకాలు

నాగాయలంక, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత మారుమూల గ్రామాల్లో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. వసతులు కూడా ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. పవన్ కల్యాణ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఉపాధి నిధులతో గ్రామాల్లో సీసీ రోడ్ల అభివృద్ధి పనులు శరవేగంతో పూర్తవుతున్నాయి. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి నోచుకోని రహదారులు నేడు సిమెంట్ రోడ్లుగా దర్శనమివ్వటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నంగేగడ్డ మైనరు పంచాయతీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్వాన్నంగా ఉన్న మూడు సీసీ రహదారులను మంజూరు చేసి సుమారు రూ.23 లక్షలను ఉపాధి నిధులను కేటాయించారు. సనకా బసవయ్య ఇంటి నుంచి 1వ నెంబరు పంట కాలువ వరకు 85 మీటర్ల పొడవున సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.5లక్షలు, 1వ నెంబర్ కాలువ నుంచి శ్మశానం వరకు 150 మీటర్ల పొడవున సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు, చల్లా వెంకటేశు నుంచి తోట కృష్ణ ఇంటి వరకు 130 మీటర్ల పొడవున సీసీ రహదారి నిర్మాణానికి రూ.8 లక్షలను కేటాయించారు.



నాడు సనకా బసవయ్య ఇంటి వద్ద బురద రహదారి,
నేడు అదే ఇంటి నుంచి పంట కాలువ వరకు పూర్తయిన సీసీ రోడ్డు

జాతీయ శాస్త్రీయ నృత్య పోటీలు 22, 23న

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సంస్థ సంస్కార భారతి విజయవాడ మహానగర్ శాఖ, సుమధుర కళానికేతన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ శాస్త్రీయ నృత్య పోటీలు ఫిబ్రవరి 22, 23న నిర్వహిస్తున్నట్టు సంస్కార భారతి అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలాంటి ప్రవేశరుసుము లేకుండా పూర్తి సేవాభావంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో కూచిపూడి, ఆంధ్ర నాట్యం, భరత నాట్యం మూడు విభాగాల్లో పోటీలుంటాయన్నారు. ప్రతి నాట్యంలోను వ్యక్తిగత విభాగంలో సీనియర్స్, జూనియర్స్, సబ్ జూనియర్స్ విభాగాలుగా విభజించి పోటీలు నిర్వహిస్తామన్నారు. బృంద విభాగంలో శాస్త్రీయ నృత్య విభాగం (క్లాసికల్ గ్రూప్ డాన్స్), జానపద నృత్య విభాగం (ఫోక్ గ్రూప్ డాన్స్) అనే రెండు విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. వ్యక్తిగత విభాగంలో 314 మంది కళాకారులు, బృంద విభాగం నుంచి 40 బృందాలు (240 మంది కళాకారులు) అన్ని విభాగాల నుంచి 564 మంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోనున్నారన్నారు. లబ్ద ప్రతిష్టులైన అనేకమంది గురువులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. 22న శనివారం కేబీఎన్ కళాశాలలో మూడు వేదికలు, హనుమంతరాయ గ్రంథాలయం, గాంధీనగర్, శ్రీ ధర్మ పరిషత్ అయోధ్యనగర్, సీతారామ కల్యాణ మండపం సత్యనారాయణపురం మొత్తం ఆరు వేదికలపై ఈ పోటీలు జరుగుతాయన్నారు. 23న ఆదివారం శ్రీ ఘంటసాల సంగీత నృత్య కళాశాలలో గోకరాజు లైలా గంగరాజు కళావేదికపై బృంద నృత్యాలు పోటీ, 6.45 నిమిషాలకు బహుమతి ప్రదానోత్సవ సభ జరుగుతుందన్నారు. సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరి, గద్దె రామ్మోహన్, సృజనాత్మకత, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పి.తేజస్వి, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డాక్టర్ ఎస్‌పీ భారతి, చలువాది మల్లిఖార్జునరావు, సీబీఆర్ ప్రసాద్, ఎంసీ దాస్, కేబీఎన్ కళాశాల సెక్రటరీ టి.శ్రీనివాస్ హాజరవుతారని కృష్ణ తెలిపారు.

23 నుంచి హోమియో వైద్యశిబిరం

ఉంగుటూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈనెల 23న నుంచి 26 వరకు ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పరదేశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బెంగుళూరుకు చెందిన జీవీ చలపతి మెమోరియల్ హోమియో సెల్ఫ్ రిలయన్స్ ఫోరం, స్వర్ణభారత్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రతి 2 నెలలకి ఒకసారి వరుసగా 4 రోజులపాటు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటలవరకు ఈ వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ప్రముఖ హోమియో వైద్యుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలోని వైద్యబృందం శిబిరానికి వచ్చేవారికి రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, సలహాలను ఉచితంగా అందజేస్తారన్నారు. ఉమ్మడి కృష్ణా (ఎన్టీఆర్, కృష్ణా) జిల్లాల వాసులు ఈ వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	95, 104, 115
చికెన్ విత్ స్కిన్	180
చికెన్ స్కిన్‌లెస్	190

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోండి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పొలాలకు ఆధార్‌తో విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలని ఏడీఏ ఎస్.రమాదేవి సూచించారు. బొమ్ములూరులో ఆర్ఎస్కే సెంటర్‌ను ఆమె గురువారం సందర్శించారు. రైతులతో సమావేశమయ్యారు. రైతులు నమోదు చేయించుకోవడానికి వచ్చేటప్పుడు ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకురావాలని, ఆధార్ లింక్ అయిన ఫోన్ తీసుకురావాలని సూచించారు. ఏవో బి.అనంతలక్ష్మి, బొమ్ములూరు రైతులు పాల్గొన్నారు.



బొమ్ములూరులో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ రమాదేవి



పామర్రులో కూటమి నేతల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య

కేఎస్ లక్ష్మణరావు.. ఓ జిత్తులమారి

- ఏ పార్టీ అధికారంలో ఉంటే దానికి కొమ్ము కాస్తారాయన
- ఆయన మాటలు నమ్మి మోసపోకుండా పట్టభద్రులకు అవగాహన కల్పించండి
- కూటమి నేతలతో టీడీపీ నేత వర్ల రామయ్య

పామర్రు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'కూటమి బలపర్చిన పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌పై పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావు ఓ జిత్తులమారి నక్క. ఏపార్టీ అధికారంలో ఉంటే ఆపార్టీకి కొమ్ముకాసే వ్యక్తి. అలాంటి వ్యక్తి మాటలు నమ్మి మోసపోకుండా పట్టభద్రులకు అవగాహన కల్పించండి. నిరుద్యోగ యువత సంక్షేమం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించండి' అని కూటమి నేతలు, కార్యకర్తలకు టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య సూచించారు. పాలశీతల కేంద్ర సమావేశపు మందిరంలో గురువారం నియోజకవర్గ కూటమిశ్రేణులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో 6,400 పట్టభద్రుల ఓట్లు ఆలపాటికి పడేలా ప్రతి గ్రామంలోనూ కూటమి శ్రేణులు పనిచేయాలని సూచించారు. పట్టభద్రుల సమస్యలపట్ల పూర్తి అవగాహన ఉన్న ఆలపాటిని గెలిపించుకుందామన్నారు. ఆలపాటిని గెలిపించే బాధ్యత అందరూ తీసుకోవాలని ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు బయోడైవర్సిటీ ఛైర్మన్ నీలాయపాలెం విజయకుమార్ సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే మంత్రి నారా లోకేశ్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తారని తెలిపారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, టీడీపీ నేతలు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, మండపాక శంకర్‌బాబు, రాజులపాటి శ్రీనివాసరావు, రామలింగేశ్వరరావు, జక్కా శ్రీనివాసరావు, గొట్టిపాటి లక్ష్మీదాసు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పనిచేసే ప్రభుత్వమిది

- సంపూర్ణ మద్దతివ్వండి..ఉపాధ్యాయులు, పట్టభద్రుల సమావేశంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము



డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ స్కూల్‌లో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులు, పట్టభద్రులకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, పనిచేసే ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతివ్వాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. గురువారం కూటమి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున విశ్వభారతి విద్యాసంస్థ ప్రాంగణంలో ఛైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణతో కలిసి ఉపాధ్యాయులు, పట్టభద్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఉపాధ్యాయులు, నిరుద్యోగులతో పాటు అన్నివర్గాల ప్రజలు నరకాన్ని చూశారన్నారు. అరాచక, అసమర్థ వైసీపీ పాలనకు చరమగీతం పాడటంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించారన్నారు. ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. గ్రంథాలయ సంస్థ రాష్ట్ర ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రాంబాబు, ప్రిన్సిపాల్ రాధ పాల్గొన్నారు. తర్వాత ఆంధ్ర నలంద మున్సిపల్ ఉన్నత పాఠశాల, త్రివేణి, డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, పట్టభద్రులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల పరిశీలకురాలు నూకాలమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకే వార్డు పర్యటనలు

- ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు వార్డు పర్యటనలు చేస్తున్నానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. గురువారం 17వ వార్డులో ద్విచక్రవాహనంపై ఆయన పర్యటించారు. స్థానికులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వెంటనే అధికారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. వార్డు పర్యటనకు వచ్చినప్పుడు తనను కలవలేకపోయిన వారు ప్రజావేదికలో సమస్యల అర్జీలను ఇవ్వాలని, వాటి పరిష్కారానికి తాను, తన కార్యాలయం పని చేస్తామని తెలిపారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు సూచికల ఏర్పాటు

పామర్రు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం- విజయవాడ ప్రధాన రహదారిపై బల్లిపర్రు అడ్డరోడ్డు వద్ద ప్రమాదాల నియంత్రణకు సూచికలను ఏర్పాటు చేస్తున్నామని వాహనదారులు గమనించాలని ఎస్సై రాజేంద్రప్రసాద్ కోరారు. గురువారం తన సిబ్బందితో కలిసి ఆయన ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు.

సంపద కేంద్రాలు సద్వినియోగం చేసుకోండి

- చెత్తను తగలబెట్టడంపై అంగలూరు కార్యదర్శిని ప్రశ్నించిన కలెక్టర్ డీకే బాలాజీ

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సంపదనిచ్చే చెత్తను తగలబెడతారా.. సంపద కేంద్రాలను ఎందుకు సద్వినియోగం చేసుకోవడం లేదు? మరోసారి ఇలా జరిగితే నేను మాట్లాడను పెన్నే సమాధానం చెబుతుంది అంటూ అంగలూరు పంచాయతీ కార్యదర్శి ఎలీషారావును కలెక్టర్ డీకే బాలాజీ హెచ్చరించారు. గురువారం అంగలూరులో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను పారిశుధ్య కార్మికులు వేర్వేరుగా సేకరిస్తున్నారా అని మహిళలను అడిగారు. అంతా కలిపే తీసుకుంటున్నారని వారు కలెక్టర్ బాలాజీకి చెప్పారు. అక్కడి నుంచి చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రానికి వెళ్లారు. అక్కడ ఖానాల్లో సేకరించిన చెత్త లేదు. కేంద్రం సమీపంలో వేసి తగలబెట్టడాన్ని కలెక్టర్ గమనించారు. కార్యదర్శి, మండల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈలోగా చుట్టు పక్కల ప్రజలు అక్కడికి వచ్చి చెత్త తగలబెడుతుంటే ఇబ్బందిగా ఉందని, పందులు విచ్చలవిడిగా తిరుగుతున్నాయని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. పందులను పట్టించి అడవుల్లో వదిలేయాలని ఆదేశించారు. కొందరు డ్రెయినేజీలు సరిగా లేవని ఫిర్యాదు చేయగా వెంటనే ఆ సమస్య పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, ఎంపీడీవో విజయసారథి, తహశీల్దారు లోకరాజు పాల్గొన్నారు.

బొమ్ములూరు సంపద కేంద్రం పరిశీలన

గుడివాడ రూరల్: గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. గురువారం బొమ్ములూరులో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. తడి, పొడి చెత్త వేరు చేయాలని, రోజూ తెచ్చిన చెత్తను వేరుచేసి సంపద కేంద్రంలో తయారు చేసిన ఎరువులను పంచాయతీ కేంద్రాల్లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్, కార్యదర్శి రామ్మోహనరావు పాల్గొన్నారు.



చెత్త నుంచి సంపద కేంద్రాన్ని పరిశీలించాక, కార్యదర్శి ఎలీషారావును ప్రశ్నిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయండి

- అధికారులకు కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశం

గుడివాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. గురువారం ఆర్డీవో కార్యాలయానికి ఆయన విచ్చేశారు. ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, డీఎస్పీ ధీరజ్ వినీల్‌తో ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షించారు. టూటౌన్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ పాల్గొన్నారు.

ఏజీకే పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి

గుడివాడ: పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా చదివి మరింత విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విద్యార్థులకు కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. గురువారం ఏజీకే మున్సిపల్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులతో ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. నాకు సాధ్యమే కార్యక్రమం ద్వారా బాల్యంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఉన్నత శిఖరాలను చేరుకున్న మహోన్నత వ్యక్తుల గురించి తెలుసుకుని మార్గదర్శకంగా తీసుకోవాలన్నారు.

ఐలూరు ఉత్సవాలను విజయవంతం చేయాలి

- అధికారులతో సమీక్షలో తహశీల్దార్ కుసుమకుమారి

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఐలూరులో ఈనెల 26న నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని తహశీల్దార్ ఎం.కుసుమకుమారి సూచించారు. ఐలూరు శ్రీరామేశ్వరస్వామి దేవస్థానం వద్ద గురువారం వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. దేవస్థానం వద్ద భక్తులు దైవదర్శనం చేసుకునేందుకు బారికేడ్లు, ఇతర సదుపాయాలు, నదీపాయలో భక్తులు జల్లుస్నానాలు చేసేందుకు బోర్ల నిర్మాణం, మంచినీటి పంపులు, పారిశుధ్య చర్యలపై చర్చించారు. కార్యాచరణ పనులు మొదలు పెట్టాలని తహశీల్దార్ సూచించారు. లక్షమందికిపైగా భక్తులు వస్తారని, వారికి అసౌకర్యం కలగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దేవస్థానం భూముల వివరాలను, వచ్చే ఆదాయాన్ని తెలపాలని సర్పంచ్ పేరాటి సుజాత డిమాండ్ చేయగా దేవస్థానానికి 50 ఎకరాలు మాత్రమే ఉన్నాయని ఈవో శివగోపాల్ తెలిపారు. పంచాయతీ నుంచి అన్ని పనులు చేయటం సాధ్యం కాదని చెప్పి మధ్యలోనే సర్పంచ్ వెళ్లిపోయారు. ఎంపీడీవో రవికాంత్, సీఐ వై.చిట్టిబాబు, ఎస్సై సీహెచ్ అవినాష్, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దార్ కుసుమకుమారి, పక్కన ఎంపీడీవో రవికాంత్, సీఐ చిట్టిబాబు

25 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

గుడివాడ: భీమేశ్వరస్వామి దేవస్థానం, గౌరీశంకరస్వామి దేవస్థానంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు వార్షిక మహాశివరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తామని ఈవో కె.వి.గోపాలరావు తెలిపారు. గురువారం పెద్ద శివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 26వ తేదీ తెల్లవారుజామున 4గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు దర్శనం, ప్రత్యేక అభిషేకాలు రాత్రి 9.09గంటలకు కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.21,116, రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలమునందు మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం ఏర్పాటు చేశామన్నారు. 27వ తేదీ గురువారం సాయంత్రం 6.09 గంటలకు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహిస్తామన్నారు. దేవస్థానం గోపురాలకు, ఉపాలయాలకు రంగులు వేసి ముస్తాబు చేస్తున్నామన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



సోషల్ ఆడిట్ చేస్తున్న డీఆర్పీ లక్ష్మి

కూచిపూడి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై గురువారం మొవ్వలో సోషల్ ఆడిట్ నిర్వహించారు. గ్రామంలో నిర్వహించిన 102 ఉపాధి హామీ పనులపై డీఆర్పీ బి.లక్ష్మి బృందం, కూలీల నుంచి వివరాలు సేకరించి నమోదు చేసింది. వాటిని ఎస్ఆర్పీ సత్యనారాయణకు అందజేశారు.

మొవ్వ ఎస్సీ బాలుర హాస్టల్ వార్డెన్ శామ్యూల్ గుండెపోటుతో మృతి

కూచిపూడి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మొవ్వ ఎస్సీ బాలుర స్పెషల్ హాస్టల్ వార్డెన్‌గా పని చేస్తున్న గుండాబత్తిన శామ్యూల్(52) గురువారం సాయంత్రం పామర్రులోని తన నివాసగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండు దశాబ్దాల నుంచి సాంఘిక సంక్షేమ శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయన మృతి పట్ల మండలంలో పలువురు వసతిగృహ అధికారులు సంతాపం వ్యక్తం చేశారు.



గుండాబత్తిన శామ్యూల్ (ఫైల్)

కుంభమేళాకు ఆర్టీసీ బస్సు

గుడివాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గుడివాడ నుంచి కుంభమేళాకు గురువారం ఆర్టీసీ బస్సు బయలుదేరింది. ఆర్టీసీ యూనియన్ నాయకుడు బస్సును ప్రారంభించారు. గుడివాడ పరిసర ప్రాంత ప్రజలకు మహా కుంభమేళాలో పాల్గొనే అవకాశం కల్పించినందుకు ఆయన సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. నిర్వాహకుడు బెజవాడ సురేష్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.



పుష్కరఘాట్‌పై వేసిన రహదారిని పరిశీలిస్తున్న జేఈ శ్రీరాం జనార్దన్, వీఆర్వో శ్రీనివాసరావు

ఘాట్‌ను శుభ్రం చేయిస్తాం

- రహదారి నిర్మాణానికి అనుమతి ఇవ్వలేదు: ఆర్సీ డీఈఈ గోపీనాథ్, జేఈ శ్రీరాం జనార్దన్

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఐలూరు పుష్కర ఘాట్‌పై వేసిన రహదారిని గురువారం ఆర్సీ డీఈఈ సీహెచ్ గోపీనాథ్, జేఈ శ్రీరామ్ జనార్దన్, వీఆర్వో శ్రీనివాసరావు పరిశీలించారు. ఘాట్‌పైగా రహదారి నిర్మాణానికి ఎవరికీ అనుమతి ఇవ్వలేదన్నారు. శుక్రవారంలోగా ఘాట్‌ను శుభ్రం చేయిస్తామని వారు తెలిపారు. అంతకుముందు ఐలూరు శ్రీరామేశ్వరస్వామి దేవస్థానం వద్ద నిర్వహించిన సమావేశంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. ఘాట్‌ను రహదారిగా మార్చటం సరికాదన్నారు. తక్షణమే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇక్కడ క్వారీకి ఇంకా పర్యావరణ అనుమతులు రావాల్సి ఉందని, ఆ వ్యక్తి తొందరపడి రహదారి నిర్మించారని తహశీల్దార్ అన్నారు. ఘాట్ పక్కన రహదారి నిర్మించుకుంటే అభ్యంతరం ఉండదని రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

ఘనంగా ముస్లిం మౌద్ దినోత్సవం

కూచిపూడి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మౌద్ దినోత్సవాన్ని మొవ్వ మండలం భట్లపెనుమర్రు అహ్మదీయ ముస్లింల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. షేక్ మౌలాలి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అందరినీ ప్రేమించు, విశ్వశాంతి కోసం కృషి చేద్దామంటూ మతగురువులు సందేశాన్ని అందించారు. యాకూబ్ బాషా, హజరత్ మహమ్మద్, హైదర్‌వలి, షేక్ నజర్, మీరావలి, సిద్ధా సాహెబ్ పాల్గొన్నారు.



సందేశాన్ని ఇస్తున్న మతగురువులు

ఫొటో స్టూడియో, వస్త్ర గోడౌన్‌లో చోరీ

గుడివాడ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బుధవారం అర్ధరాత్రి ఫొటో స్టూడియో, వస్త్ర దుకాణానికి చెందిన గోడౌన్‌లో చోరీ జరిగింది. టూటౌన్ పోలీసులు తెలిపిన ప్రకారం.. నెహ్రూచౌక్ సెంటర్‌లోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులోని మెట్రో స్టూడియోలో బుధవారం అర్ధరాత్రి షట్టర్‌కున్న తాళాన్ని, క్యాష్ కౌంటర్లను పగులగొట్టి రూ.80వేలు విలువైన రెండు కెమెరాలు, రూ.10 వేలను దొంగలు అపహరించారు. పాత మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న డెనిమ్ షోరూమ్ గోడౌన్‌లో అర్ధరాత్రి గొళ్లెం పగులగొట్టి రూ.30వేలు విలువైన బనియన్లు అండర్‌వేర్లు దొంగిలించారు. గురువారం డీఎస్పీ ధీరజ్ వినీల్, టూటౌన్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ ఘటనా ప్రదేశాలను పరిశీలించారు. బందరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వేలిముద్రలను సేకరించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ ఎస్సై నాగరాజు తెలిపారు. వన్‌టౌన్ పరిధిలోని ఏటూరురోడ్డులోని శ్రీపద్మావతి ఆస్పత్రి మెడికల్ షాపులోనూ ఇదేతరహాలో దొంగతనం జరిగినట్లు సమాచారం. కేసు నమోదు కాలేదు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్

34 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నానికి చెందిన లార్స్ ల్యాబ్స్ తమ కళాశాల ఎలక్ట్రానిక్స్, మెకానికల్ విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించగా 34 మంది రూ.2.30 లక్షల వార్షిక వేతనంతో ఎంపికయ్యారని ఏఏఎన్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నిమ్మగడ్డ రాజశేఖర్ తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎలక్ట్రికల్ విభాగాధిపతి ఎం.వినయ్‌ను, విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన అధ్యాపకులను యాజమాన్యం అభినందించింది.



మొవ్వలో స్వచ్ఛ పంచాయతి

కూచిపూడి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ గ్రామ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా గురువారం వేకువజాము నుంచే అధికారులు, ప్రజాప్రతినిధులు మొవ్వలో రోడ్లు ఊడ్చారు. రోడ్లకిరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛ గ్రామపంచాయతీల్లో భాగస్వాములై గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు సూచించారు. తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించి పారిశుధ్య కార్మికులకు వేర్వేరుగా వాటిని అందించి గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈవోపీఆర్డీ పరమాత్మ, పంచాయతీ కార్యదర్శి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలి

పమిడిముక్కల: తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందించాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, మండల ప్రత్యేక అధికారి ఎంఎన్ రాణి సూచించారు. అగినపర్రులో గురువారం ఆమె పర్యటించారు. పారిశుధ్య నిర్వహణ, తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో డి.వెంకటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి నరసింహారావు పాల్గొన్నారు.



మొవ్వలో స్వచ్ఛ గ్రామ పంచాయతీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు





ఉపాధ్యాయుడికి మూడు ఇంక్రిమెంట్లు కట్

అవనిగడ్డ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : బందలాయిచెరువు ఎంపీయూపీ పాఠశాల ఉపాధ్యాయుడు కె.జీవేంద్రరావుకు మూడు ఇంక్రిమెంట్లు నిలుపుదల చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి రామారావు ఉత్తర్వులు జారీ చేశారు. యూటీఎఫ్ అవనిగడ్డ మండల శాఖ అధ్యక్షుడిగా పని చేస్తున్న జీవేంద్రరావుపై పలు ఆరోపణలు వచ్చాయి. డీఈవో విచారణ చేపట్టగా, ఆరోపణలు రుజువు కావటంతో 9(వి1) ఏపీసీసీఏ రూల్స్ 1993 ప్రకారం మూడు ఇంక్రిమెంట్లు నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పిస్తున్న డీఆర్వో చంద్రశేఖర్

సోలార్ రూఫ్‌టాప్‌తో వెలుగులు నింపాలి : డీఆర్వో

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంట్లో సోలార్ రూఫ్‌టాప్‌తో వెలుగులు నింపాలని, దీని వల్ల విద్యుత్ చార్జీల భారం తగ్గుతుందని డీఆర్వో కె. చంద్రశేఖర్ అన్నారు. పీఎం సూర్యఘర్ పథకం కింద లబ్ధిదారులకు ఇచ్చే ప్రోత్సాహకాలపై అవగాహనా సదస్సులో డీఆర్వో మాట్లాడారు. 360 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 3కెవి సోలార్ టాప్‌కు రూ. 78,400, 240 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 2కెవికి రూ. 60 వేలు, 120 యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం కలిగిన 1 కెవికి రూ. 30 వేలు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. సౌర విద్యుత్‌ను గ్రిడ్‌కు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందవచ్చన్నారు. మెప్మా పీడీ పి. సాయిబాబు, ఏవో సిహెచ్‌వి ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

చెల్లని చెక్కు ఇచ్చిన డాక్టర్‌కు జైలు, జరిమానా

మచిలీపట్నం టౌన్ , ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చెల్లని చెక్కు ఇచ్చిన ప్రభుత్వ వైద్యురాలికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ మచిలీపట్నం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.దేవి సాయిశ్రీవాణి గురువారం తీర్పు చెప్పారు. హైదరాబాద్‌లోని ఎస్ఆర్‌నగర్ ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ యశోద మచిలీపట్నంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఈడే ఉమా మహేశ్వరరావు వద్ద 2012 జూన్ 6వ తారీఖున రెండు లక్షల రూపాయలు అప్పుగా తీసుకుని ప్రామిసరీ నోటు రాయించి ఇచ్చింది. 2018 ఏప్రిల్ 29వ తేదీన డాక్టర్ యశోద ప్రామిసరీ నోటు బాకీ మూడు లక్షల రూపాయల చెక్కును ఫిర్యాది ఈడే ఉమామహేశ్వరరావు పేరున ఇచ్చింది. చెక్కును ఉమామహేశ్వరరావు మచిలీపట్నం కరూర్ వైశ్య బ్యాంకులో దాఖలు చేయగా తిరిగి వచ్చింది. తాను అప్పు చేయలేదని, తన భర్త మీద విరోధంతో కోర్టుకెక్కారని డాక్టర్ యశోద వాదించారు. స్వదస్తూరితో ప్రామిసరీ నోటు రాసినందున డాక్టర్ యశోదకు మూడు నెలలు సాధారణ జైలు, మూడు లక్షల రూపాయల జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి. దేవిసాయి శ్రీవాణి తీర్పునిచ్చారు. నాలుగు నెలలలోపు నష్ట పరిహారం చెల్లించని పక్షంలో అదనంగా మరో మూడు నెలల జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

పురుగుమందు తాగి ఆత్మహత్య

చల్లపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : భార్య, పిల్లలకు దూరంగా ఉంటున్న వ్యక్తి మనస్తాపంతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆముదార్లంకలో జరిగింది. తిరుమలశెట్టి వెంకట రమణ (41) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. భార్య శ్యామ లమ్మతో మనస్పర్థల కారణంగా మూడేళ్ల క్రితం పెద్ద మనుషుల సమక్షంలో విడిపోయాడు. ఇద్దరు పిల్లలతో భార్య పుట్టింటి వద్దే ఉంటుండగా, వెంకటరమణ అన్న దమ్ముల దగ్గర ఉంటున్నాడు. మద్యానికి బానిసైన వెంకట రమణ మనస్తాపంతో బుధవారం పురుగుమందు తాగి తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు తొలుత రేపల్లె ప్రభుత్వాసుపత్రికి ఆ తర్వాత మెరుగైన వైద్యచికిత్స కోసం తెనాలి ఆసుపత్రికి తీసుకువెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. మృతుని సోదరుడు ఏడుకొండలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చల్లపల్లి హెడ్ కానిస్టేబుల్ బీవీఎస్‌వి. ఈశ్వరప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దివి యూనిట్ నూతన పాలకవర్గం ఏకగ్రీవం

అవనిగడ్డ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం దివి యూనిట్ నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో యూనిట్ అధ్యక్షుడిగా ప్రభాకర్‌ను, కార్యదర్శిగా సుమన్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పవన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాము, కార్యదర్శి వరప్రసాద్, ఉపాధ్యక్షులు రామారావు, బ్రహ్మానంద బాబు, లోకేష్, వీరబాబు, రత్నకుమారి, ‘దిరతులు పాల్గొని సంఘ పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

సర్పంచ్ చొరవతో పైప్‌లైన్‌కు మరమ్మతులు

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పులిగడ్డ శివారు పాత కోట - రేగుల్లంక వెళ్లే దారిలో పైపులైన్ పగిలిపోయింది. పైపులైన్ పగిలిన విషయాన్ని గ్రామస్థుల ద్వారా తెలుసుకున్న సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి సరఫరా పునరుద్ధరించారు. పంచాయతీ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, కార్యదర్శి అనితకు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీలో కారుణ్య నియామకాలు : కొనకళ్ల

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీలో చాలా కాలం నుం చి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టినట్లు రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు పేర్కొన్నారు. తన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సురక్షిత ప్రయాణం అందించే ఆర్టీసీని అందరూ గౌరవిస్తున్నారన్నారు. కొత్తగా బ్యాటరీ బస్సుల కొనుగోలుపై దృష్టి సారిస్తున్నామన్నారు.



బార్ అసోసియేషన్‌లో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర



నందిగామ గ్రామంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



తెలుగురావుపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు

ఆలపాటిని అఖండ మెజార్టీతో గెలిపించాలి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రా అభివృద్ధి పథంలో నడిపించే బాధ్యత కూటమి ప్రభుత్వం తీసుకుందని, తోటి న్యాయ వాది ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను శాసనమండలికి పంపించాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. బార్ అసోసియేషన్ సమావేశపు హాలులో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించిన నాదెండ్ల మనోహర్ పిలుపు మేరకు టీడీపీ సీటును ఆలపాటి త్యాగం చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు పెట్టినా అమరావతిలోనే హైకోర్టు స్థాపించామని, కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేశా మన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీడీపీ నాయకులు కొనకళ్ల జగన్నాథరావు, గొర్రెపాటి గోపీచంద్, పరిశీలకుడు శ్యావల దేవదత్, మో టమర్రి బాబా ప్రసాద్, గోపు సత్యనారాయణ, మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు. కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేం ద్రప్రసాద్ గెలుపు కోసం జిల్లా మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు కొక్కిలిగడ్డ నాగరమేష్, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ళ కాంతారావు, గొర్రెపాటి గోపీచంద్, కొమరగిరి చంద్రశేఖర్, వి. సుందరరాం, బుల్లెట్ ధర్మారావు, లంకిశెట్టి నీరజ, పి.వి. ఫణికుమార్, బత్తిన దాసు, బొడ్డు నాగరాజు తదితరులు విస్తృత ప్రచారం చేశారు. **పెడన రూరల్** : ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు గొట్టుముక్కల రఘురామరాజుతో కలసి నందిగం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి వీరప్రసాద్, శీరం ప్రసాద్, కాగిత లక్ష్మీ నాగేశ్వరరావు, అనగాని అం కాలరావు, యారగాని నాగగరాజు,సొంటి రాము, జన్ను ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. **ఘంటసాల** : ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలంటూ శ్రీకాకుళం, తెలుగురావుపాలెం, గోగినేనిపాలెం, పాపవినాశనం గ్రామాల్లో ఉన్న పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కూటమి నేత లు పరుచూరి సుభాష్ చంద్రబోస్, అయినపూడి భాను ప్రకాష్, తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా), సూరపనేని శివ రామప్రసాద్, యార్లగడ్డ వీరభద్రరావు, గుత్తికొండ వర ప్రసాద్, పరిశె చలపతి, కొడాలి లక్ష్మణ్, కుంపటి సుబ్బారావు, ఆరుంబాక రవి, సుగ్గన పవన్ కుమార్, కొండవీటి శ్రీనివాస్, మునిపల్లి బుజ్జి, ఆత్కూరి సీతారామరాజు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : పులిగడ్డలో కూటమి నాయకులు మండలి శేషు, చెన్ను శివాజీ, నాగిడి రాంబాబు, నాగిడి వెంకటేశ్వరరావు, మండలి రామ్మోహన్ రావు, గుంటూరు వినయ్‌బాబు తదితరులు ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. **చల్లపల్లి** : ఆలపాటి రాజాకు ఘన విజయాన్ని అందించాలని కోరుతూ చల్లపల్లిలో కూటమి నేతలు గురువారం ముమ్మర ప్రచారం చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు మోర్ల రాంబాబు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ తోట కనకదుర్గ, టీడీపీ నేతలు షేక్ నబీషోరి, మోర్ల శివ, బోలెం నాగమణి తదితరులు పాల్గొన్నారు. జనసేన నేతలు బొందలపాటి వీరబాబు, అడపా రాంబాబు, సూదాని నందగోపాల్, గంగిశెట్టి రాజేంద్ర తదితరులు ప్రచారం చేశారు. **మోపిదేవి** : ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలంటూ కూటమి నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. కోసూరు వారిపాలెంలో ఇంటింటికి వెళ్లి పట్టభద్రులను గుర్తించి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రాజేంద్ర ప్రసాద్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. యక్కటి వెంకటేశ్వరరావు, భోగిరెడ్డి సాంబశివరావు, యక్కటి హనుమాన్ ప్రసాద్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.



చల్లపల్లిలో ప్రచారం చేస్తున్న రాంబాబు తదితరులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న న్యాయాధికారి కె.వి.రామకృష్ణయ్య

క్రమశిక్షణతో విద్యార్థులు ఎదగాలి

గూడూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు చెడు వ్యసనాలకు లోను కాకుండా మంచి అలవాట్లు కలిగి, క్రమశిక్షణతో ఎదగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.వి. రామకృష్ణయ్య అన్నారు. అంతర్జాతీయ సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా గూడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. రామకృష్ణయ్య మాట్లాడుతూ, పేదవారికి అందిస్తున్న ఉచిత న్యాయ సహాయం గురించి అంగన్‌వాడీ వర్కర్లు ఇంటింటి ప్రచారం చేయాలన్నారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఫణిధూర్జటి, న్యాయవాది ముసలయ్య, ఎంఈవో సుబ్రహ్మణ్యం, ఎస్ఐ కె.ఎన్.వి. సత్యనారాయణ, హెచ్‌ఎం డి. పుష్పలత పాల్గొన్నారు.



పాఠశాల విద్యార్థులతో పూర్వవిద్యార్థి, కెనరా బ్యాంకు జీఎం తోట రవిచంద్ర, ఎంఈవో వెంకటేశ్వరరావు

పూర్వ విద్యార్థి కృషితో మరుగుదొడ్ల నిర్మాణం

చల్లపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలోని వరదా రామలింగయ్య ఎంపీపీ పాఠశాలలో పూర్వవిద్యార్థి, పశ్చిమ గోదావరి జిల్లా కెనరా బ్యాంకు జనరల్ మేనేజర్ తోట రవిచంద్ర కృషితో మరుగుదొడ్ల నిర్మాణం జరిగింది. హెచ్‌ఎం సూచనతో స్పందించిన జీఎం రవిచంద్ర చల్లపల్లి కెనరాబ్యాంకు సౌజన్యంతో రూ.1.50 లక్షల నిధులు మంజూరు చేయించారు. రెండు మరుగుదొడ్లు, వరండాకు గ్రిల్స్ ఏర్పాటు చేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో పి.వెంకటేశ్వరరావు, పూర్వ విద్యార్థి రవిచంద్ర, హెచ్‌ఎం సూర్యదేవర పద్మజ, ఉపాధ్యాయురాలు మహమ్మద్ షాహీనాలు పాల్గొన్నారు.

పేరుపాలెం బీచ్‌లో కృత్తివెన్ను యువకుడి శవం?

మొగల్తూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పేరుపాలెం బీచ్ వద్ద కొబ్బరి తోటల్లో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు చిలకపచ్చ బనియన్, జీన్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, వయస్సు 26-30 ఏళ్ల లోపు ఉంటాయని, మృతుడి జేబులో ఒక మహిళ పాన్ కార్డు ఉంద ఎస్సై తెలిపారు. మృతుడు కృష్ణాజిల్లా కృత్తివెన్ను మండలానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నామన్నారు.



గురువారం రాత్రి నాగులేరును పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర

శివరాత్రికి నాగులేరు వద్ద ఏర్పాట్లు : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : నాగులేరు వద్ద లక్షలాది భక్తులు పుణ్యస్నానాలు చేస్తారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని శివరాత్రి నాటికి అన్ని ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్, మునిసిపల్, పోలీసు, దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. నాగులేటిని గురువారం ఆయన పరిశీలించారు. మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, సనకా నాగులు, పిప్పళ్ళ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

అవనిగడ్డ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహా టశివరాత్రికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు ఆదేశించారు. పాత ఎడ్లంక గ్రామాన్ని ఆయ న సందర్శించారు. బాలకోటేశ్వరస్వామి వార్షిక మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే, కృష్ణానది వద్ద పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. సీఐ యువకుమార్, రెవెన్యూ, పంచాయతీ, ఇతర శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడు వీరబాబు మృతి..కాగిత నివాళి




పెడన రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సీనియర్ నాయకుడు ఉమ్మడిశెట్టి వీరబాబు గురువారం హఠాన్మరణం చెందాడు. వీరబాబు భౌతికకాయాన్ని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సందర్శించి నివాళులర్పించారు.వీరబాబు మృతి పార్టీకి తీరనిలోటన్నారు. శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, ఉమ్మడిశెట్టి శ్రీరామమూర్తి, చెన్నూరు శేఖర్ పాల్గొన్నారు.

కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించండి

కోడూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కె.ఎస్.లక్ష్మణరావును గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పి.మోహనరావు కోరారు. కోడూరులోని విద్యాసంస్థల్లో, గ్రామంలో గ్రాడ్యుయేట్లను కలిసి విస్తృతం ప్రచారం చేశారు. ఆవుల బసవయ్య, పోలినాయుడు, కొప్పనాతి తాతయ్య మెండు బాలకృష్ణ, యోగ ప్రకాష్, బి.కనకారావు, అశోక్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సుందరకాండ హరికథ



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : ఈడేపల్లి ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో విగ్రహ పునః ప్రతిష్ఠ సందర్భంగా గురువారం రాత్రి బుర్రా పద్మనాభరావు సుందరకాండ హరికథాగానం చేశారు. హార్మోనియంపై తరకటూరి శ్రీనివాస్, మృదంగంపై అమ్మిరెడ్డి వెంకటేశ్వరరావు సహకరించారు. పద్మనాభరావును ఆలయ కమిటీ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.




దేవరకోట పాల సంఘం అధ్యక్షుడు రత్నగిరిరావు, రైతులను సత్కరిస్తున్న చలసాని

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం : చలసాని

ఘంటసాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ ధ్యేయమని ఛైర్మన్ చలసాని ఆంజనేయులు పేర్కొన్నారు. దేవరకోట గ్రామంలో కృష్ణా మిల్క్ యూనియన్ వజ్రోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు వేమూరి రత్నగిరిరావు, రైతులను ఛైర్మన్ చలసాని ఆంజనేయులు ఘనంగా సత్కరించారు. మేనేజర్ చిట్టూరి దా మోదర కృష్ణ గోపినాథ్, సూపర్‌వైజర్ తమ్మన సురేష్ కుమార్, వేతన కార్యదర్శి తుమ్మల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.







పాగోలులో ప్రతిష్ఠా పూజలు చేస్తున్న విద్యాసాగర్ గురూజీ, బంగారుబాబు దంపతులు

చల్లపల్లి పడమర వీధిలో పునర్నిర్మించిన రామాలయం, ప్రతిష్ఠించనున్న విగ్రహాలు

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు

చల్లపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : పాగోలు కైవల్యాశ్రమ చలాచలబోధోపదేశ మందిర ప్రాంగణంలో శ్రీకమలాత్మిక సహిత అచలేశ్వర పంచాయతన ప్రతిష్ఠామహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం దశ మహావిద్య అనుష్ఠానాలు, ఊరేగింపు, శ్రీచక్రార్చన, చండీహోమం, దత్తాత్రేయ హోమం, దాన్యాధివాసం, మూలమంత్ర హోమం ఆజ్యపూర్ణాహుతి తదితర పూజలు విద్యాసాగర్ గురూజీ పర్యవేక్షణలో డాక్టర్ వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, కేదారశర్మ జరిపించారు. మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీ ప్రసాద్, ట్రస్టీ మేకా బంగారుబాబు, వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు పాల్గొన్నారు.

పడమరవీధిలో నేటి నుంచి..

పడమరవీధి జెండాచెట్టు బజారులో పునర్నిర్మించిన శ్రీరాఘవరపు వెంకటకృష్ణమ్మ జానకి రామాలయంలో శుక్రవారం నుంచి ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం కానున్నా యి. సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీరామచంద్ర స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేకం నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నా యి. 23వ తేదీ ఆదివారం ఉదయం గం.7.55లకు మూలా నక్షత్రయుక్త మీనలగ్న పుష్కరాంశమందు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్లు దేవాలయ నిర్మాణదాతలు, కమిటీ పెద్దలు తెలిపారు.